WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 246 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | మంగళవారం 2 సెప్టెంబర్ 2025 | వెల : 2-00



## శిథిలాల దిబ్బగా
# అఫ్గానిస్థాన్

- 6.0 తీవ్రతతో భూకంపం.. 800 మందికి పైగా దుర్మరణం
- 2,500 మందికి పైగా క్షతగాత్రులు
- గ్రామాలకు గ్రామాలే ధ్వంసం
- కూలిన ఇళ్ల కింద ఇంకా చాలా మంది
- మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం
- ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- అన్ని రకాలుగా ఆ దేశాన్ని ఆదుకుంటామని హామీ

కాబుల్, స్వర్ణసాగరం

యుద్ధాలు, అంతర్యుద్ధాలు, క్షామాలతో తరచూ అతలాకుతలమయ్యే అఫ్గానిస్థాన్‌లో మరో ఘోర విషాదం. ఆదివారం రాత్రి రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రతతో నమోదైన భూకంపం ఆ దేశానికి కాళరాత్రిని మిగిల్చింది. ఏకంగా 800 మందికి పైగా ప్రాణాలను బలిగొంది. 2,500 మందికి పైగా పౌరులను క్షతగాత్రులను చేసింది. భూకంప తాకిడికి గ్రామాలకు గ్రామాలే ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకున్న ఆప్తులను రక్షించుకొనేందుకు చేతులతోనే చాలా మంది మట్టిని తవ్వితీస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. తాలిబన్ ప్రభుత్వం - మిగతా 3లో



# చేయని చదునుకు సాయం

- కూటమిలోనూ వైసీపీ నేతలదే రాజ్యం
- జగనన్న కాలనీల్లో నాడు ఉత్తుత్తి చదును
- ఆ పనులపై తనిఖీలకు కూటమి ఆదేశం
- అయినా, వారికి బిల్లులు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారుల ఉత్సాహం
- కోర్టుకు వెళ్లే వైసీపీ నేతలకు పూర్తి సహకారం
- తనిఖీల విషయం కావాలనే దాస్తున్న వైనం
- దీంతో కోర్టుల్లో నేతలకు అనుకూలంగా తీర్పులు

వివరాలు 3లో..

## ధైర్యంగా ఉండండి...
# అండగా నిలుస్తా



- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా
- పులివెందుల క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్
- కార్యకర్తలు, ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్న వైఎస్ జగన్

కడప, స్వర్ణసాగరం

వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. సోమవారం మధ్యాహ్నం పులివెందులలోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూటమి ప్రభుత్వంలో పడుతున్న బాధలు, సమస్యలను ప్రజలు వివరించారు. ప్రజల బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ 'నేనున్నాను…' అంటూ భరోసా ఇవ్వడంతోపాటు ధైర్యాన్ని నింపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు తెలుసుకుని, వారి సమస్యలు ఓపిగ్గా విని, వారికి వెన్నుదన్నుగా ఉంటానని మాటిచ్చారు. కూటమి ప్రభుత్వం చాలా

## హైడ్రోజన్ బాంబు
# త్వరలో పేలుస్తా!



- ఓట్ల చోరీపై మరిన్ని నిజాలు బయటపెడతా
- 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో రాహుల్
- ఓట్ల దొంగతనంపై మరిన్ని నిజాలు బయటపెట్టిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి వస్తుంది
- ఓట్ల చోరీని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని విప్లవాత్మక రాష్ట్రమైన బిహార్ యావత్ దేశానికి స్పష్టమైన సందేశం ఇచ్చింది

2

## హిమాచల్, ఉత్తరాఖండ్‌లో
# వర్ష బీభత్సం



- కొండచరియలు విరిగి ఏడుగురు మృత్యువాత
- ఛార్‌ధామ్, హేమ్‌కుండ్ యాత్రలు నిలిపివేత

2

## 99.5% ఓటర్లు సరైన ధ్రువీకరణలను సమర్పించారు

అనర్హుల తొలగింపులో ఆ రెండు పార్టీలు మాత్రమే సహకరించాయి

## వచ్చే ఎన్నికల్లోనూ
# ఎన్డీఏదే గెలుపు



అభివృద్ధి ఎవరిదో.. విధ్వంసం ఎవరిదో చర్చిద్దాం


అసెంబ్లీకి రాకుండా తప్పుడు ప్రచారాలా?

- వైసీపీకి చంద్రబాబు సవాల్.. అదో ఫేక్ పార్టీ అని ధ్వజం
- సూపర్‌సిక్స్ పథకాల నుంచి ప్రాజెక్టుల దాకా..
- బాబాయ్ హత్య, దళిత డ్రైవర్ శవం డోర్ డెలివరీ కోడికత్తి డ్రామా, గులకరాయి ఎపిసోడ్ వరకూ
- వీటన్నిటిపైనా మాట్లాడదాం సిద్ధమా?
- నాడు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కదా!
- పులివెందులలో కూడా విజయం సాధిస్తాం
- రాజంపేట సభలో ముఖ్యమంత్రి ఉద్ఘాటన
- ములక్కాయలపల్లెలో మహిళకు రూ.15 వేల దివ్యాంగ పెన్షన్

దోబీఘాట్‌లో రజకులతో మాటామంతీ

రాయచోటి, స్వర్ణసాగరం

"మీకు ధైర్యం ఉంటే.. చిత్తశుద్ధి ఉంటే.. మీ 11 మంది ఎమ్మెల్యేలూ అసెంబ్లీకి రండి.. పింఛన్లు సహా ఏ అంశంపైనైనా చర్చిద్దాం. నాడు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కదా! నేడు సూటిగా అడుగుతున్నా.. అసెంబ్లీకి సిద్ధమా? ఎవరిది సంక్షోభ పాలనో? ఎవరిది సంక్షేమ రాజ్యమో తేల్చేద్దాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి సవాల్ విసిరారు. ఎవరిది విధ్వంసమో ఎవరిది అభివృద్ధి పాలనో. శాసనసభ సాక్షిగా తేల్చేద్దామన్నారు. సూపర్ - మిగతా 3లో



## కష్టకాలంలోనూ
# కలిసే ఉన్నాం

- మన బంధం ప్రాంతీయ సుస్థిరతకు మూలస్తంభం: మోదీ
- భారత ప్రధానిని తన కారులో తీసుకువెళ్లిన పుతిన్
- అందులోనే ముప్పావుగంట ఏకాంత భేటీ
- భారత్‌తో అనుబంధం పార్టీలకు అతీతమన్న రష్యా అధినేత
- ఒకే వేదికపై భారత్, చైనా, రష్యా సారథులు

2

# హిమాచల్, ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం

న్యూఢిల్లీ

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో సోమవారం భీకర వర్షాలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో ఏడుగురు చనిపోయారు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ మార్గంలో సోమవారం ఉదయం కొండచరియలు విరిగి వాహనంపై పడగా ఇద్దరు యాత్రికులు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సోన్‌ప్రయాగ్%-%గౌరీకుండ్ మార్గంలోని ముంకాటియా వద్ద కొండప్రాంతం పక్క నుంచి వెళ్తున్న వాహనంపై ఒక్కసారిగా బండరాళ్లు పడ్డాయని అధికారులు తెలిపారు. బాధితులంతా ఉత్తరకాశీ జిల్లాకు చెందిన వారేనన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థి తి విషమంగా ఉందన్నారు. భారీ వర్షాలు కొనసాగుతుండటంతో ఛార్ ధామ్ యాత్ర, సిక్కుల హేమ్‌కుండ్ సాహిబ్‌కు వెళ్లే దారిని ఈ నెల 5వ తేదీ వరకు మూసివేసినట్లు అధికారులు వివరించారు. వాతా వరణం మెరుగయ్యాక, రహదారులు పూర్తి సురక్షితమని భావించిన తర్వాతే తిరిగి రాకపోకలను అనుమతిస్తామన్నారు. సోమవారం ఉదయం 8 గంటల వేళకు చంపావత్ జిల్లా బన్‌బాసాలో 25.64 సెంటీమీటర్లు, ఖతిమాలో 18.1 సెంటీమీటర్లు, తనక్‌పూర్‌లో 17.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశమున్న డెహ్రాడూన్, ఉత్తరకాశీ, తెహ్రీ, పౌడీ, నైనిటాల్ తదితర 9 జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు.



**హిమాచల్‌లో ఐదుగురు..**

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా జిల్లాలో 24 గంటల వ్యవధిలో వేర్వేరు చోట్ల కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఐదుగురు చనిపోయారు. వీరిలో ఒక మహిళ, ఏడేళ్ల ఆమె కుమార్తె ఉన్నారు. జుంగాలోని డబ్లూ ప్రాంతంలో కొండచరియలు విరిగి ఇల్లు కూలడంతో తండ్రి, అతడి పదేళ్ల కుమార్తె మరణించారు. సిమ్లాలోని కోట్‌ఖైలో ఇల్లు కూలి వృద్ధ మహిళ మరణించారు. కొండచరియలు విరిగిపడటంతో సిమ్లా%-%కల్కా మార్గంలో నడిచే ఆరు రైళ్లను రద్దు చేశారు. దెబ్బతిన్న ఐదు జాతీయ రహదారులు సహా 793 రహదారులను మూసివేశారు. మంగళవారం వరకు ఆరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం హెచ్చరించింది.

**కశ్మీర్‌లో అమిత్ షా పర్యటన**

జమ్మూకశ్మీర్‌లోని కత్రాలో భారీ వర్షం కురియడంతో మాతా వైష్ణోదేవి ఆలయాన్ని వరుసగా ఏడో రోజూ మూసి ఉంచారు. జమ్మూకశ్మీర్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని వారి పునరావాసానికి అన్ని విధాలుగా సాయమందిస్తామని హోం మంత్రి అమిత్ షా తెలిపారు. సోమవారం జమ్మూలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, సీనియర్ నేతలతో రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు.

# సీపీఎస్ రద్దు చేయకపోతే ఉద్యమం తప్పదు

- ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల హక్కులకు భంగం
- ఉద్యోగులతో చాకిరీ, వేధింపులు
- రెవెన్యూ, పోలీస్ అధికారులను పార్టీ కార్యకర్తలుగా మారుస్తున్నారు
- బీసీవైకు ఒక్క అవకాశం ఇస్తే ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు
- బీసీవై అధినేత బోడే రామచంద్ర యాదవ్



విజయవాడ, స్వర్ణసాగరం

ఏపీలో ప్రభుత్వాలు మారినా.. నాయకులు మారినా.. అధికారం మారుతున్నా ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందని బీసీవై జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ విమర్శించారు. సోమవారం ఏపీసీపీఎస్ పెన్షన్ మార్చ్ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం రైలు అయితే.. ఉద్యోగస్తులు ఇంజన్ లాంటి వారని కానీ ఈ రోజు ప్రభుత్వాలు తీసుకుంటోన్న నిర్ణయాల వల్ల, ఉద్యోగస్తుల పట్ల అనుసరిస్తోన్న విధానాలు, వేధింపులతో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దినదినగండంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఆర్థిక, ఉద్యోగ భద్రతతో పాటు పదవీ విరమణ తర్వాత పెన్షన్ భద్రత ఉంటుందన్న నమ్మకం ఉద్యోగస్తుల్లో పోయిందని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారి ఉద్యోగులపై వేధింపులు ఎక్కువ అవుతున్నాయని.. ఉద్యోగుల హక్కులు అణిచివేతకు గురవుతున్నాయని రామచంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు రాష్ట్రంలో ఉపాధ్యాయులను నాన్ టీచింగ్ పనులకు వాడుకుంటూ.. పోలీసు, రెవెన్యూ ఉద్యోగులను అధికారంలో ఉన్న పార్టీ కార్యకర్తల్లా ట్రీట్ చేసే పరిస్థితికి ప్రభుత్వాలు దిగజారిపోయాయన్నారు. ఆర్థిక సంస్కరణల పేరుతో ఉద్యోగస్తు జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో వేసిన భట్టాచార్య కమిషన్ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తే.. వీళ్లు సీపీఎస్ విధానంతో 20 లక్షల మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాడం ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుస్తులపై నాడు కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయం తీసుకునే అవకాశం ఉండి కూడా.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అభీష్టానికి వ్యతిరేకంగా సీపీఎస్ అమల్లోకి తీసుకువచ్చారన్నారు. నాటి నుంచి నేటి వరకు కూడా దీనిపై ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేదని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేస్తామని గతంలో జగన్మోహన్‌రెడ్డి, తర్వాత కూటమి నాయకులు అందరూ.. ఉద్యోగస్తుల ఓట్లతో గద్దె నెక్కాక ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. సీపీఎస్ రద్దు విషయంలో ఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. 2003లో డీఎస్సీ ద్వారా ఎంపికైన 16 వేల మంది ఉద్యోగులను కూడా 2004 తర్వాత అమలులోకి వచ్చిన సిపిఎస్ విధానంలోకి తీసుకువచ్చి వారికి తీవ్ర అన్యాయం చేశారని రామచంద్ర యాదవ్ వాపోయారు. దీనిపై తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో అక్కడ ఉద్యోగులకు న్యాయం జరిగినా.. ఏపీ ఉద్యోగస్తుల విషయంలో ఏ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన డీఎస్సీ, గ్రూప్స్ నియామకాల్లో వచ్చే ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేస్తారా ? లేదా గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ అమలు చేస్తారో ఇప్పటకీ సరైన స్పష్టత లేదన్నారు. ఇప్పటికి అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరచి సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని.. ఈ విషయంలో ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోరాటానికి బీసీవై పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ సీపీఎస్ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయనిపక్షంలో భవిష్యత్తులో బీసీవై పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని.. రాష్ట్ర ప్రజలు తమకు ఒక్క అవకాశం ఇస్తే ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతామని కూడా రామచంద్ర యాదవ్ ప్రకటించారు.

# కష్టకాలంలోనూ కలిసే ఉన్నాం

తియాన్‌జిన్

అత్యంత కష్టకాలంలోనూ భారత్–రష్యా కలిసే ఉన్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇరు దేశాలూ భుజంభుజం కలిపి నడిచాయన్నారు. ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్త సుస్థిరతకు రెండు దేశాల మధ్య భాగస్వామ్య బంధం మూలస్తంభంగా నిలుస్తుందని చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనడానికి చైనాలోని తియాన్‌జిన్‌కు చేరుకున్న మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం ఆ కార్యక్రమం ముగిశాక విడిగా భేటీ అయ్యారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం, పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ వంటి పరిణామాల నేపథ్యంలో వీరి చర్చలు ఆసక్తి రేకెత్తించాయి. భారత్–రష్యా అనేక దశాబ్దాలుగా ప్రత్యేక స్నేహబంధం కొనసాగిస్తున్నాయని, ఇవి ఇంకా అభివృద్ధి చెందడానికి తాజా భేటీ పునాది వేస్తుందని పుతిన్ పేర్కొన్నారు. ఇరుదేశాల బంధాలు రాజకీయాలకు పూర్తిగా అతీతమన్నారు.

**10 నిమిషాలు నిరీక్షించి.. తోడ్కొని వెళ్లి..**

మోదీ, పుతిన్ ఒకే కారులో హోటల్ వరకు ప్రయాణిస్తూ ముచ్చటించుకున్నారు. మోదీని కారులోకి తోడ్కొని వెళ్లేందుకు పుతిన్ పది నిమిషాలు నిరీక్షించారు. పావుగంటలోనే హోటల్‌కు చేరిన ఇద్దరు నేతలు కారు నుంచి కిందికి దిగకుండా చాలాసేపు లోపలే కూర్చొన్నారు. వారు ముప్పావుగంటసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. పుతిన్‌తో కారు ప్రయాణం ఫొటోను మోదీ 'ఎక్స్'లో పంచుకున్నారు. 'మా ఇద్దరి మధ్య చర్చలు ఎప్పుడూ వివేకంతో జరుగుతాయి. ఈసారీ అద్భుతంగా సాగింది' అని ఆయన పేర్కొన్నారు. కొన్ని కీలకాంశాలపై వీరు కారులో మాట్లాడుకుని ఉంటారని రష్యాలోని వర్గాలు భావిస్తున్నాయి. పేరుకు అది కారే అయినా ఇంట్లో సౌకర్యవంతమైన గదిలో ఉన్నట్లే ఉంటుందని తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు వాడే 'బీస్ట్'లా పుతిన్ వాడే ఆరస్ లిమోసీన్ కారులో భద్రతపరంగా అనేక వ్యవస్థలు ఉంటాయి. తుపాకీ గుళ్లను, బాంబుదాడులను, క్షిపణులను తట్టుకోగలదు. రసాయన దాడి నుంచి రక్షించేందుకు ప్రత్యేక సౌకర్యాలున్నాయి. సదస్సు ప్రారంభ సమయంలో పుతిన్‌ను మోదీ ఆత్మీయంగా పలకరించారు. ఆలింగనం చేసుకున్నారు.

**ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించాలి**

ద్వైపాక్షిక చర్చల్లో ఉక్రెయిన్ యుద్ధం ప్రస్తావనకు వచ్చింది. యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాల్సిందిగా మానవత్వ పిలుపు ఇస్తున్నట్లు మోదీ తెలిపారు. డిసెంబరులో పుతిన్‌ను స్వాగతించేందుకు భారత్‌లోని 140 కోట్లమంది ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి, మోదీకి మధ్య రెండ్రోజుల క్రితం జరిగిన ఫోన్ సంభాషణ సారాంశాన్ని పుతిన్‌కు భారత ప్రతినిధి బృందం వివరించింది. అమెరికా సుంకాలపై అధికారిక ప్రకటనలో ప్రస్తావన లేకపోయినా దానిపై మోదీ, పుతిన్‌లు కారులోనే మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది.

**షెహబాజ్‌ను పట్టించుకోని భారత ప్రధాని మోదీ**

సదస్సులో ఒకే వేదికపై మోదీ, పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఈ సదస్సులో భారత్, పాక్ ప్రధానులు ఎదురుపడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోదీ, పుతిన్ మాట్లాడుకుంటూ కలిసి వెళ్తుండగా పాక్ ప్రధాని షెహబాజ్ అక్కడే నిల్చున్నప్పటికీ.. మోదీ పట్టించుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోయిన దృశ్యాలు బయటకొచ్చాయి. చాలా సందర్భాల్లో పాక్ ప్రధానికి దూరంగా మోదీ ఉన్నారు.

## హైడ్రోజన్ బాంబు త్వరలో పేలుస్తా!

పాట్నా

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీపై ఇప్పటికే అణుబాంబు పేల్చానని, త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తానని పేర్కొన్నారు. ఓట్ల దొంగతనంపై మరిన్ని నిజాలు బయటపెట్టిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి వస్తుందని, ఆయన తలెత్తుకోలేరని చెప్పారు. సోమవారం బిహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదాన్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు.

ఓట్ల చోరీని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని విప్లవాత్మక రాష్ట్రమైన బిహార్ యావత్ దేశానికి స్పష్టమైన సందేశం ఇచ్చిందని వెల్లడించారు. మహాత్మాగాంధీని హత్య చేసిన దుష్ట శక్తులే నేడు రాజ్యాంగాన్ని హత్య చేయడానికి కుట్రలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం జోలికి వస్తే సహించబోమని బీజేపీని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించడానికే యాత్ర చేపట్టానని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, ఓటు చోర్, గద్దీ ఛోడ్ అంటూ వారు ముక్తకంఠంతో నినదించారని అన్నారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం మాట్లాడారంటే...

**రేషన్ కార్డును, భూమిని లాక్కుంటారు**

"బీజేపీ నాయకులు మాకు నల్లజెండాలు చూపించారు. వారు ఒక విషయం తెలుసుకోవాలి. ఓట్లచోరీపై మహాదేవపురలో అణుబాంబు ప్రయోగించా. త్వరలో హైడ్రోజన్ బాంబు రాబోతోంది. అందుకోసం బీజేపీ నేతలు సిద్ధంగా ఉండాలి. ఓట్ల దొంగతనంపై బీజేపీ అసలు రంగు ఏమిటో ప్రజలకు తెలిసిపోతుంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి దక్కాల్సిన విజయాన్ని బీజేపీ కూటమి దొంగిలించింది.

ఇది వంద శాతం నిజం. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్ల చోరీకి పాల్పడ్డాయి. బిహార్ యువతకు చెప్పదల్చుకున్నది ఏమిటంటే.. ఓటు చోరీ అంటే హక్కుల చోరీ, రిజర్వేషన్ల చోరీ, ప్రజాస్వామ్యం చోరీ, ఉద్యోగాలు%-%ఉపాధి అవకాశాల చోరీ, విద్య చోరీ, భవిష్యత్తు చోరీ. కేవలం ఓటునే కాకుండా మీ రేషన్ కార్డును, భూమిని సైతం లాక్కొని అదానీకి, అంబానీకి కట్టబెట్టాలని చూస్తున్నారు" అని రాహుల్ గాంధీ బీజేపీపై నిప్పులు చెరిగారు.

**తప్పుడు విధానాలు నమ్ముకుంటున్న మోదీ: ఖర్గే**

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీరుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో సోషలిజం గురించి మాట్లాడిన నితీశ్ ఇప్పుడు బీజేపీ%-%ఆర్‌ఎస్‌ఎస్‌ల ఒడిలో సేదతీరుతున్నారని ధ్వజమెత్తారు. పనికిరాని చెత్తను ఎక్కడ పారేస్తారో నితీశ్‌ను బీజేపీ%-%ఆర్‌ఎస్‌ఎస్‌లు అక్కడే పారేయడం తథ్యమని స్పష్టంచేశారు. ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సభలో ఖర్గే మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ నెగ్గడానికి ప్రధాని మోదీ ఓట్ల చోరీకి ఆలోచనతోనే ఉంటారని ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం బోగస్ ఓట్లను, తప్పుడు ప్రచారాన్ని, తప్పు డు హామీలు, తప్పుడు పథకాలను నమ్ముకుంటారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## శిథిలాల దిబ్బగా అఫ్గానిస్థాన్


-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్న సహాయక చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రజలు ఇంకా శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నారు. జలాలాబాద్ నగరానికి ఈశాన్యంలో 27 కిలోమీటర్ల దూరంలో కేవలం 8 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ లోతు తక్కువగా ఉండటంతోనే తీవ్రత అధికంగా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 11.37 గంటలకు సంభవించిన భూకంపం.. కునార్, నంగర్‌హార్ ప్రావిన్స్‌లను కుదిపేసింది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉండటంతో ఇళ్ల పైకప్పులు కూలి చాలా మంది సజీవ సమాధి అయిపోయారు. చాలా ప్రాంతాల నుంచి ఇంకా సమాచారం అందడం లేదని, పూర్తి వివరాలు లభ్యమైతే మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రతినిధి తెలిపారు. 2023 అక్టోబరులోనూ 6.3 తీవ్రతతో అఫ్గాన్‌లో భూకంపం సంభవించింది. ఆ విపత్తులో దాదాపు 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. భూకంపం తాకిన తూర్పు అఫ్గానిస్థాన్.. పర్వత ప్రాంతం. దీంతో మారుమూల గ్రామాల్లో ఇంకా సహాయక చర్యలు ప్రారంభం కాలేదు. చాలా ప్రాంతాల్లో ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. శిథిలాల కింద అనేకమంది ఇంకా సజీవంగా ఉన్నారని అనుమానిస్తున్నారు. సాయం అందడంలో జరుగుతున్న జాప్యం కారణంగా వీరంతా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రంతా పలు మార్లు భూమి కంపిస్తూనే ఉందని తెలిపారు. భూకంప కేంద్రానికి దగ్గరలో ఉన్న జలాలాబాద్ పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలోని అతిపెద్ద వాణిజ్యనగరం. దాదాపు 3 లక్షల మందికి నివాస ప్రాంతం. పాకిస్థాన్‌లోనూ పలు ప్రాంతాల్లో భూమి కంపించింది.

అఫ్గానిస్థాన్ భూకంపంలో భారీ ప్రాణనష్టం సంభవించడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ విపత్తులో కుటుంబసభ్యులను, సన్నిహితులను కోల్పోయిన వారికి తగిన శక్తినివ్వాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భూకంపం ధాటికి నష్టపోయిన అఫ్గాన్‌కు అన్ని రకాల సాయం అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికే మానవతా సాయాన్ని భూకంప ప్రభావిత ప్రాంతాలకు పంపించడం ప్రారంభించామని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు.

## 99.5% ఓటర్లు సరైన ధ్రువీకరణలను సమర్పించారు

న్యూఢిల్లీ




బిహార్‌లోని 7.24 కోట్ల మంది ఓటర్లకుగాను ఇప్పటి వరకు 99.5 శాతం మంది వెరిఫికేషన్ కోసం ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) సోమవారం వెల్లడించింది. ముసాయిదా ఓటరు జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపులో ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్‌లు మాత్రమే తమకు సాయం చేశాయని ఈసీ వివరించింది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన సీపీఐ ఎంఎల్ 103 మంది పేర్లను తొలగించాలని కోరగా, ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్‌లు కలిసి 25 పేర్లను కలపాలని దరఖాస్తులను అందించాయని పేర్కొంది. గుర్తింపు జాతీయ పార్టీ అయిన బీజేపీ మాత్రమే ఓటరు ముసాయిదాకు సంబంధించిన 16 అభ్యంతరాలను అందజేసిందని వివరించింది. బిహార్ ఎస్ఐఆర్‌పై మార్పులు, చేర్పులకు ఆఖరు రోజైన సోమవారం భారీగా దరఖాస్తులు అందాయని వెల్లడించింది. జాబితా నుంచి తొలగించాలని ఏకంగా 2.17 లక్షల దరఖాస్తులు అందగా, తమ పేర్లను చేర్చాలని 36 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించింది. ముసాయిదా జాబితాలో పొరపాటున చేర్చిన తమ పేర్లను తొలగించాలంటూ 2.17 లక్షల మంది వ్యక్తులు ఇప్పటి వరకు దరఖాస్తులను అందజేశారని ఈసీ అధికారులు తెలిపారు. బిహార్ ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ముసాయిదాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులకు సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత కూడా అవకాశమిస్తున్నట్లు ఈసీ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది.

# వచ్చే ఎన్నికల్లోనూ ఎన్డీఏదే గెలుపు

-మొదటిపేజీ తరువాయి

సిక్స్ పథకాల నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకూ, పెట్టుబడుల నుంచి పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల వరకూ, బాబాయ్ హత్య నుంచి దళిత డ్రైవర్ శవం డోర్ డెలివరీ దాకా, కోడికత్తి డ్రామా నుంచి గులకరాయి ఎపిసోడ్ వరకు చర్చిద్దామని సవాల్ చేశారు. సభకు రాకుండా.. ఫేక్ మీడియాతో తప్పుడు ప్రచారాలు చేస్తామంటే మాత్రం కుదరదన్నారు. 'పేదలకు సేవ' కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆయన పర్యటించారు. తొలుత ములక్కాయలపల్లె వెళ్లి అనారోగ్యంతో 14 ఏళ్లుగా మంచంపైనే జీవనం సాగిస్తున్న మహిళకు రూ.15 వేలు వికలాంగ పింఛను అందజేశారు. తర్వాత బోయనపల్లెలో రజకులతో మాట్లాడారు. అనంతరం తాళ్లపాకలో ఏర్పాటుచేసిన ప్రజావేదికలో మాట్లాడారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముచ్చటించారు.

కార్యకర్తల సమావేశంలో, తర్వాత బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో ఒక ఫేక్ పార్టీ ఉందని.. అవినీతితో పేపర్, టీవీ పెట్టుకుని అన్నీ తప్పులే రాస్తున్నారని మండిపడ్డారు. 'పోలవరం మేం కడితే దానిని కూలుస్తారు.. ప్రజా రాజధాని అమరావతి ఉండాలని మనం ఆకాంక్షిస్తే అమరావతిని ఎడారి చేశారు.. మనం రోడ్లు వేస్తే.. రోడ్లన్నీ గుంతలు పెట్టారు.. అలాంటి పార్టీకి నేను సవాల్ విసురుతున్నా.. అసెంబ్లీకి రండి.. అసెంబ్లీలో చర్చిద్దాం.. అసెంబ్లీలో సమాధానం చెప్పే ధైర్యం సత్తా మాకుంది. మీరు చేసిన తప్పుడు పనులు.. ఫేక్ మీడియాలో రాసే తప్పుడు కథనాలకు మేం సమాధానం చెప్పాలా..' అని నిలదీశారు. రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఏర్పడుతుందని చెప్పారు. పులివెందులలో కూడా కూటమి గెలుస్తుందన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

**అప్పు చేసి బాగుపడిన వాళ్లు ఎవరైనా ఉన్నారా?**

గత ప్రభుత్వం అప్పులు చేసి ప్రజలను మోసం చేసింది. ఎక్కడైనా అప్పులు చేసిన కుటుంబం బాగుపడిందా? అందుకే ఆదాయాన్ని పెంచి.. అభివృద్ధి చేసి అందులో పేదవాడిని ఆదుకుంటున్నాను. గతంలో హైదరాబాద్‌లో నేను ఐటీ అంటే అందరూ ఎగతాళి చేశారు. ఈ రోజు చూస్తే నేను ప్రారంభించిన ఐటీ ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపు తెస్తోంది.. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా అక్కడ తెలుగులో మాట్లాడితే వంద మంది చేరతారు. తెలుగు మాట్లాడే వారు అన్ని దేశాలకూ వెళ్తున్నారు. 30 ఏళ్లలో హైదరాబాద్ విశ్వనగరంగా తయారైంది.

**భయం నుంచి స్వేచ్ఛ..**

2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోనూ విధ్వంసం జరిగింది. ప్రజలు భయం భయంగా బతికారు. ఐదేళ్లు వారి ముఖాల్లో నవ్వులు లేవు. ఏమీ మాట్లాడలేని పరిస్థితి. ఈ తరుణంలో నేను, పవన్ కల్యాణ్ కలిసి పోటీ చేయాలనుకున్నాం. బీజేపీ కూడా ముందుకు వచ్చింది. ముగ్గురం 94 శాతం స్ట్రైక్ రేట్‌తో.. ఎప్పుడూ లేనంత మెజారిటీతో గెలిచాం ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. భయం లేకుండా మాట్లాడగలుగుతున్నారు. ఎమ్మెల్యేలు తప్పుచేసినా నిలదీయగలుగుతున్నారు. ఇదీ మేం కల్పించిన స్వేచ్ఛ. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలి. మంచి ప్రభుత్వానికి అండగా నిలబడాలి. గత ఏడాది విజయం మన సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతోంది. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి అనేక సంస్కరణలకు నాంది పలికారు. నేను మొదటి నుంచీ సంస్కరణలు అమలు చేశాను. దేశం అభివృద్ధి కావాలి.. మనం కూడా దేశంలో ఒక భాగం. టీడీపీ ఎప్పుడూ ప్రజల కోసమే అధికారాన్ని ఉపయోగిస్తుంది. ఆ రోజుల్లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. నేను సీఎం అయ్యాక.. నాడు యునైటెడ్ ఫ్రంట్, నేడు ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నాను.

**జీవితానికి ఇంకేం కావాలి..?**

గతంలో బావులు, వాగులు, వంకలు వద్దకు రజకులు వెళ్లి దుస్తులు ఉతికి తీసుకొచ్చేవారు. వారి కష్టాలను చూసి.. ఊళ్ల మధ్యలో దోభీ ఘాట్లను కట్టి బోర్లు వేయించాం. ఇప్పుడు దోభీఘాట్లలో వృద్ధ రజకులు నన్ను చూసి 20 ఏళ్ల క్రితం మీరే కట్టించారు సార్ అని చెబితే నాకెంతో ఆనందంగా ఉంది. ఒకచోట రజకుడు.. ఇస్త్రీ పెట్టె మీరే ఇచ్చారు సార్ అని చెప్పడం చూస్తే.. జీవితంలో ఇంకేం కావాలని అనిపించింది. టీడీపీ, ఎన్టీఏ బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తున్నాయి. సమైక్య రాష్ట్రంలో ఆదరణ-1, ఆదరణ-2 పథకాలు ప్రవేశపెట్టాను.

**రాబోయే రోజుల్లో సంజీవని ప్రాజెక్టు**

ఆరోగ్య, ఆనంద సమాజం కోసం ప్రయత్నిస్తున్నాను. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోయే రోజుల్లో సంజీవని అనే ప్రాజెక్టు తీసుకొస్తున్నాను. ఇది వినూత్నమైన ప్రాజెక్టు. టెక్నాలజీ సాయంతో విజయవంతమవుతుంది. పేదవాడి ఆరోగ్యం కాపాడే విధంగా.. ఏ మందు అవసరమో ఆ మందు తీసుకొస్తాం. ఎక్కువ బియ్యం తినడం వల్ల కార్బోహైడ్రైట్స్ పెరిగి బీపీ, షుగర్ వస్తున్నాయి. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడానికి సంజీవని ఎంతో ఉపయోగపడుతుంది. అంతకుముందు మధ్యాహ్నం 12.20 గంటలకు హెలికాప్టర్లో రాజంపేటలోని హెలిప్యాడ్ వద్ద సీఎం దిగారు. జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరవ శ్రీ?ధర్, షాజహాన్‌బాషా తదితరులు స్వాగతం పలికారు.

**14 ఏళ్లుగా మంచంలోనే..!**

రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో సుమారు 14 ఏళ్లుగా మంచంలోనే జీవనం సాగిస్తున్న యడబల్లి సుమిత్రమ్మ(54)కు ముఖ్యమంత్రి స్వయంగా రూ.15 వేలు దివ్యాంగ పింఛనుగా అందజేశారు. ఆమె అనారోగ్య సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె భర్త వెంకటేశ్వర్‌రాజుతో మాట్లాడారు. తాను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నానని.. భార్య అనారోగ్యంపాలై మంచానికే పరిమితమవడంతో అష్టకష్టాలు పడుతున్నామని రాజు చెప్పాడు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. అనంతరం బోయనపల్లె గ్రామంలో దోభీఘాట్‌కు చేరుకుని రజకులతో మాట్లాడారు. టి.ఆదిలక్ష్మి, బి.లక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి, హరిప్రసాద్, జయరాం, నరసింహులు, పెంచలయ్య, సంటయ్య తదితరులతో ఆప్యాయంగా మాట్లాడారు. వృత్తి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బోయనపల్లె ప్రజలు ఆయనకు మంగళ హారతులు పడుతూ నీరాజనాలు పలికారు.

# చేయని చదునుకు సాయం

స్వర్ణసాగరం అమరావతి

గత వైసీపీ హయాంలో కొందరు కాంట్రాక్టర్లు 'జగనన్న కాలనీల' చదును వంకతో డబ్బులు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ ఇప్పుడు తిరిగి వారే బిల్లులు చేసుకుంటున్నారు. ఆ ప్రభుత్వంలో వీరంతా అడ్డగోలుగా జేబులు నింపుకొన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పుడు కూడా వారే యమజోరును ప్రదర్శిస్తున్నారు. అధికారుల సహకారంతో కోర్టుల్లో కేసులు వేసి అనుకూల తీర్పులు పొందుతున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో చదును పనులను ఉపాధి హామీ పథకం నిధులతో సాగించింది. కాంట్రాక్టర్లుగా మారిన వైసీపీ నాయకుల్లో చాలామంది ఈ పనులు దక్కించుకున్నారు. అయితే, ఉపాధిలో అనుమతి లేని పనులుగా వీటిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తేల్చింది. జగన్ సర్కారుకు మొట్టికాయలు వేసింది. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి హౌసింగ్ విభాగానికి ఈ పనులను అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. అప్పటినుంచి హౌసింగ్‌లో ఇష్టారాజ్యంగా దోపిడీ కొనసాగింది. జగనన్న కాలనీల్లో చదును పనులు చేపట్టకుండానే బిల్లులను వైసీపీ నేతలకు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారులు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఫలితంగా పనుల్లేకుండానే జగనన్న ఇళ్ల కాలనీ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఈ అక్రమాలను నివారించలేని పరిస్థితి ఏర్పడింది.

**సాగు.. తున్న తనిఖీలు**

గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటి స్థలాల లెవలింగ్‌పై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ విచారణకు చంద్రబాబు ప్రభుత్వం ఆదేశించింది. అసెంబ్లీ జీరో అవర్‌లో లెవలింగ్ అవకతవకలపై చర్చ రావడం, పలు పత్రికల్లో కథనాలు రావడం, రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణ తేజ రంగంలోకి దిగారు. ఆ పనులు తనిఖీ చేసిన తర్వాతే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఎక్కడికక్కడ పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈలు, ఉపాధి పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు, అవసరమైన చోట ఇతర శాఖల ఇంజనీర్లతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి సమగ్రమైన విచారణ చేసి సిఫారసులు చేయాలని జిల్లా కలెక్టర్లుకు కృష్ణతేజ సూచించారు. ఆయా జిల్లాల్లో ఆయా పనులకు సంబంధించి 25 శాతం పెండింగ్ చెల్లింపుల పనుల జాబితాను ఆయా డ్వామా పీడీల నుంచి సేకరించాలని, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? లేదా?, గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన సీనరేజ్ చార్జీలు ఆయా పనులు చేసిన వెండర్లు చెల్లించారా లేదా? తదితర నిబంధనలను తనిఖీ సందర్భంగా పాటించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు ఆయా పనులకు సంబంధించి పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత ఇంటి స్థలాల లెవలింగ్ పనుల బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అయితే కమిషనర్ ఆదేశించి 8 నెలలవుతున్నా ఇంకా తనిఖీలు కొన...సాగుతూనే ఉన్నాయి. జిల్లాల్లో కొన్ని చోట్ల గతంలో పనులు నిర్వహించిన సందర్భంలో ఉన్న అధికారులే ఇప్పటికీ ఉన్నారు. దీంతో విచారణ తూతూ మంత్రంగా సాగుతున్నదన్న విమర్శలు వస్తున్నాయి.

**వైసీపీ నేతలకు దోచిపెట్టారు..**

స్థానిక నేతలకు అప్పనంగా దోచిపెట్టేందుకు ఇంటి స్థలాల లెవలింగ్ పనులను గత ప్రభుత్వం ఎంచుకుంది. ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు అనుమతి లేకపోయినప్పటికీ.... పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీ సహకారంతో అడ్డగోలుగా పనులు చేపట్టారు. సుమారు రూ.1125 కోట్ల పనులు చేపట్టి సుమారు రూ.1500 కోట్లకు పైగా బిల్లులను వైసీపీ నేతలు బిల్లులు అప్‌లోడ్ చేశారు. అయితే, ఉపాధిలో ఈ పనులకు అనుమతి లేదని.... చెల్లింపులు చేయరాదని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీంతో ఎలాగైనా వైసీపీ నేతలకు ఈ బిల్లులు చెల్లించాలన్న ఉద్దేశంతో ఈ బిల్లులు చెల్లింపుల ప్రక్రియ హౌసింగ్ ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధిశాఖ వద్ద ఉన్న పనులు బిల్లులను హౌసింగ్‌కు మార్చారు. ఈ క్రమంలో పలు పనులకు సంబంధించి మొత్తం కొలతలను మార్చేసి భారీ స్కాంకు తెరదీశారు. సుమారు రూ.460 కోట్ల ఉపాధి నిధులను సర్దేశారని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది.

**రికవరీ చేస్తాం : ప్రభుత్వం**

క్వాలిటీ కంట్రోల్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో చాలా చోట్ల రికార్డు చేసిన మేర పనులు లేవని తేలింది. అయినా, అప్పటి వైసీపీ నేతలను బిల్లులు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారులు అమిత ఉత్సాహం చూపుతున్నారు. వైసీపీ నేతలకు ఇవ్వాల్సిన మొత్తం బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీఓలతో కోర్టులకు స్టేట్‌మెంట్‌లు ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు 23 మంది వైసీపీ నేతలు కోర్టును ఆశ్రయించారు. ఏలూరు నుంచి ఇద్దరు, నెల్లూరు నుంచి ఐదుగురు, బాపట్ల నుంచి ఆరుగురు, ప్రకాశం నుంచి ఒకరు, పల్నాడు నుంచి ఆరుగురు, ఎన్టీఆర్ జిల్లాలో ముగ్గురు వైసీపీ నేతలు కోర్టుకెళ్లారు. కాగా, క్వాలిటీ కంట్రోల్ నివేదికను కోర్టు దృష్టికి తీసుకెళ్లకుండా కొందరు ఎంపీడీవోలు పూర్తిబిల్లులు చెల్లించినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఆ ఎంపీడీవోల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని ఉపాధి హామీ డైరక్టర్ షణ్ముక్‌కుమార్ సోమవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా హెచ్చరించారు

## వాహనదారులకు ఆర్టీఏ మెసేజ్ లు

స్వర్ణసాగరం విజయవాడ

"ఏపీలోని వాహనదారులకు ముఖ్యమైన గమనిక.. మీకు డ్రైవింగ్ లైసెన్స్ , వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) ఉందా.. అయితే వెంటనే అందులోని మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోండి. ఆధార్ ధ్రువీకరణ ద్వారా సెల్ ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేసుకోండి.." అంటూ ఏపీ రవాణా శాఖ నుంచి వాహనదారులకు మెసేజులు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఎవరికి వారే వ్యక్తిగతంగా ఈ పని చేసుకోవచ్చని.. ఇందుకోసం జూజీతీతిలజీష్ట్రజీని.ఐనీల.తిని పోర్టల్‌ను సందర్శించాలని రవాణాశాఖ సంక్షిప్త సందేశాలు పంపిస్తోంది. ఆ పోర్టల్‌లో ఆర్‌సీ, లైసెన్సు వివరాలను మొబైల్ నంబరుతో అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తోంది.ఇదంతా ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం పరివాహన్ సేవ అనే పోర్టల్ అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అన్ని రాష్ట్రాల రవాణాశాఖ సేవలను ఇందులోకి మారుస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి రవాణా శాఖ సేవలు ఈ ప్రగతి.ఓఆర్‌జీలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇందులోని వివరాలను కూడా పరివాహన్‌లోకి మార్చారు. అయితే కొన్ని డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల వివరాలు అప్‌డేట్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటిని వాహనదారులు సొంతంగా ఆధార్ ధ్రువీకరణ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ సూచిస్తోంది.మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలనుకుంటే వాహనదారులు ముందుగా పరివాహనసేవాస్ అనే పోర్టల్‌లోకి వెళ్లాలి. ఆ తర్వాత పరివాహన్ పేజీలోకి వెళ్లాలి. ఆ పేజీలో పలు రకాల సేవలు ఉంటాయి. అందులో ఏదో ఒక సేవ పైన క్లిక్ చేయగానే అప్‌డేట్ యువర్ మొబైల్ నంబర్ అంటూ స్క్రీన్ మీద వస్తుంది. ఇందులో వాహన్, సారథి అంటూ క్యూఆర్ కోడ్లు, వెబ్‌సైట్ లింకులు దర్శనమిస్తాయి. మొబైల్‌లో అప్‌డేట్ చేసుకునే వారు.. ఖీఖీ కోడ్ స్కాన్ చేసి అప్ డేట్ చేసుకోవచ్చు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ ద్వారా అయితే లింక్‌లను క్లిక్ చేసి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వాహన్, సారథి రెండింటిలోనూ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.వాహన్‌లో అయితే.. వాహనాల ఆర్సీలను మొబైల్ నంబర్‌తో లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్, ఛాసిస్, ఇంజిన్ నంబర్ల వివరాలను నింపి.. ఆర్‌సీలోని వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత క్యాప్చా నమోదు చేసి.. వ్యాలిడేట్ మీద క్లిక్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఆధార్ కార్డు నంబరు, ఆధార్ కార్డులో ఉన్నట్టుగానే పేరు నమోజు చేయాలి. మొబైల్ నంబరు నమోదు చేసి వెరిఫై మీద క్లిక్ చేయాలి. దీంతో మొబైల్ నంబరు.. ఆర్‌సీకి లింక్ అవుతుంది. అప్పటికే మొబైల్ నంబర్ లింక్ చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు.మరోవైపు సారథిలో అయితే డ్రైవింగ్ లైసెన్సులను మొబైల్ నంబర్‌తో అప్‌డేట్ చేసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్సు నంబరు, పుట్టినరోజు, ఇతరత్రా వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత క్యాప్చా నమోదు చేసి.. ఆధార్ కార్డు వివరాలు ఎంటర్ చేస్తే.. ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేసి సబ్మిట్ బటన్ నొక్కితే.. డ్రైవింగ్ లైసెన్సు వివరాలు మొబైల్ నంబర్‌తో లింక్ అవుతాయి. ఇలా చేస్తే భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ బదిలీ సులువుగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు

## ధైర్యంగా ఉండండి... అండగా నిలుస్తా

-మొదటిపేజీ తరువాయి

వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని, అకారణంగా దాడులు చేస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద వాపోయారు. దీనికి ఆయన స్పందిస్తూ... ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. ఇటీవల హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క పోలీసు వ్యవస్థనే కాకుండా అన్ని వ్యవస్థలను ఈ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని వైఎస్ జగనమండిపడ్డారు. ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలిగానీ కీడు చేయకూడుడదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, పార్టీ అని చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేశామని ఆయన గుర్తుచేశారు.

**కక్ష సాధించడమే పనిగా పెట్టుకున్న ప్రభుత్వం**

టీడీపీ కూటమి సర్కార్ ప్రజలకు మేలు చేయడం పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ నేతులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడుమే పనిగా పెట్టుకుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశుురు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, కడప మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, ఎస్‌బీ అంజాద్‌బాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేడు వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం వైఎస్ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు అర్పించనున్నారు. మత పెద్దలు నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నారు. అనంతరం

లింగాల మండలంలోని అంబకపల్లె చేరుకోనున్నారు. నూతనంగా నిర్మించిన చెరువుకు కృష్ణా జలాలు చేరిన నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలహారతి ఇస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## త్రిశూల వ్యూహంలో పవన్

స్వర్ణసాగరం విజయవాడ

జనసేన ఫ్యూచర్ రాజకీయాల గురించి తన అంతరంగాన్ని బయటపెట్టారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. అందుకు టైమ్ ఫిక్స్ చేసుకున్నారు. కేవలం తనకు దశాబ్దంపాటు సమయం ఇవ్వాలని పార్టీ కార్యకర్తలను ఆయన కోరారు.ఇంతకీ పవన్ అసలు టార్గెట్ వైసీపీ అని అంటున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. చీటికి మాటికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పార్టీ కార్యకర్తలను ఒక్కటే కోరుతున్నారు. దశాబ్దంపాటు కూటమి బంధం బలంగా ఉంటుందని చెబుతున్నారు. దశాబ్ద కాలం తనకు సమయం ఇవ్వాలని, మిమ్మల్ని నాయకులుగా, దేశ నిర్మాణంలో కీలక వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత తనది అని చెప్పుకొచ్చారు. ఈలోగా ఏపీలో అభివృద్ధి ఒక లెవల్‌కి వస్తుందన్నది కొందరు నేతల మాట. పార్టీ కూడా బలంగా తయారు అవుతుందని, అప్పుడు సొంతంగా పోటీ చేయాలన్నది జనసేనాని ఆలోచనగా చెబుతున్నారు. ఈ దశాబ్దం పాటు రాజకీయాలు ఏవిధంగా ఉంటాయన్నది కూడా వివరించారు. దసరా తర్వాత 'త్రిశూల్' కార్యక్రమం మొదలుపెడుతున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు పవన్ కళ్యాణ్. ప్రతి క్రియాశీలక సభ్యుడికి గుర్తింపు, నాయకత్వం, భద్రతే ప్రధాన అంశాలుగా ఆ కార్యక్రమం ఉండబోతుందని వెల్లడించారు. మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్ దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామం మొదలు నియోజకవర్గం, పార్లమెంటు, జిల్లా, రాష్ట్ర స్థాయి బలమైన శక్తిగా పార్టీని ఎదిగించాలన్నది జనసేన ఆలోచన. బాధ్యతలు మోయడంలో కుటుంబాన్ని విస్మరించానని, సినిమాలపై సరిగా దృష్టి పెట్టలేదన్నారు పవన్ కల్యాణ్. అన్నీ వదిలేశానేమో కానీ జన సైనికులు, వీర మహిళలపై సంపూర్ణ దృష్టి పెట్టానన్నారు. దాని ఫలితం దేశంలో ఘనమైన విషయం సాధించామన్నారు. 100 శాతం విజయం సాధించడమంటే ఆశామాషీ కాదన్నారు. నాయకులు కావాలనే ఆశయం ఉన్న ప్రతి ఒక్కరికీ దిశానిర్దేశం చేస్తానన్నారు. దేశ నిర్మాణం కోసం, బలోపేతం కోసం కలిసి అడుగులు వేద్దామన్నారు. అన్నట్లు జనసేన సభకు జాతీయ పార్టీ లుక్ వచ్చింది. పార్టీ కార్యక్రమం కోసం జనసేన కార్యకర్తలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా తరలి వచ్చారు. ఒడిషా, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. వారిలో కర్ణాటక కార్యకర్తలు ఆ రాష్ట్ర జెండాను తీసుకొచ్చారు. జనసేన జెండాలతో కలిపి ఆ జెండాను ప్రదర్శించారు. దీంతో పవన్ కల్యాణ్ ఆ జెండాతో పాటు కండువాలను తెప్పించుకుని మెడలో వేసుకుని జెండాను ఊపారు. దీంతో సభ జరుగుతున్న ప్రాంతం ఒక్కసారిగా మార్మోగిపోయింది. మనం బలహీనపడితే ఏపీలో మళ్లీ అరాచక పాలన వస్తుందని చెప్పకనే చెప్పారు. అందువల్లే కూటమి దశాబ్దంపాటు సాగాలన్నారు. అందుకే 15 ఏళ్ల పాటు రాజకీయ స్థిరత్వం అవసరమని నొక్కి వక్కానించారు. భాగస్వామ్య పక్షాలతో సమస్యలు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గడచిన ఐదేళ్లు తమ పార్టీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా ఏనాడూ కేంద్రం సహాయం కోరలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. దసరా తర్వాత త్రిశూల్ కార్యక్రమం: పవన్ కళ్యాణ్. ప్రతి క్రియాశీలక సభ్యుడికి గుర్తింపు, నాయకత్వం, భద్రతే ప్రధాన అంశాలుగా త్రిశూల్ కార్యక్రమం. నాయకులు కావాలనే ఆశయం ఉన్న ప్రతి ఒక్కరికీ దిశానిర్దేశం చేస్తాను. ?

## తాడిపత్రికి పెద్దిరెడ్డి

స్వర్ణసాగరం అనంతపురం

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మరోసారి నియోజకవర్గంలోకి అడుగు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనను తాడిపత్రి నియోజకవర్గంలోకి అడుగు పెట్టేందుకు పోలీసులు అనుమతించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకూ తాను తాడిపత్రికి వెళ్లితీరతానని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి చెబుతున్నారు. ఆయన హైకోర్టుకు వెళ్లారు. అక్కడ సింగిల్ బెంచ్ తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతించినా తర్వాత డివిజన్ బెంచ్ కు పోలీసులు వెళ్లారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళితే శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశముందని చెప్పడంతో డివిజన్ బెంచ్ పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతిని నిరాకరించింది. గతంలో ఇచ్చిన సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే విధించింది. తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ పార్టీల మధ్య ఒక విధంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. తాడిపత్రి నియోజకవర్గంలోకి వెళ్లేందుకు తనను అనుమతించకపోవడంపై పెద్దారెడ్డి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారంలో ఉండి పోలీసులను అడ్డం పెట్టుకుని తనకు అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల్ల తనకు కూడా తాడిపత్రి ప్రజలు ఓట్లు వేశారన్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. తాను తన సొంత ఇంటికి వెళ్లేందుకు అనుమతిని కూడా ఇవ్వకుండా పోలీసులతో కుమ్మక్కై ఈ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలను ఆయన నేరుగా చేస్తున్నారు. ఈ సమయంలో పెద్దారెడ్డి సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రెండు, మూడు రోజుల్లో తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు అయితే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే ఆయన బాధితులే అడ్డుకుంటారని హాట్ కామెంట్స్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి అనేక అరాచకాలు, అక్రమాలు చేశాడని, గత ప్రభుత్వంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి కోమటికుంట్లలో 180 ఎకరాలు ఆక్రమించుకున్నాడని, తాడిపత్రి అంటే తమకు ఒక దేవాలయం, తాడిపత్రి ప్రజలు తమకు దేవుళ్ళని అంటున్నారు.

# సారంగం వారి వీధి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు





### కోటలో అంబరాన్ని అంటిన గణేష్ ఉత్సవ ఊరేగింపు

### గణనాధుని లడ్డుని 56000 కి దక్కించుకున్న కిన్నెర హరీష్

కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 1

కోట మండలం కోటలోని సారంగం వారి వీధి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు 5 రోజులు పాటు అంగరంగ వైభవంగా జరిగాయి.అందులో భాగంగా 5వ రోజు ఆదివారం రాత్రి గణనాథుని గ్రామోత్సవం తీన్మార్ బ్యాండ్ సెట్, తెనాలి బ్యాండ్,వివిధ రకాల వేషధారణలతో వివిధ రకాల పూల అలంకరణలతో,బాణసంచా వేడుకల మధ్య గణనాథుని ఉత్సవం కోటలో కన్నుల పండుగగా సారంగం వారి వీధి యూత్ సభ్యులు నిర్వహించారు. ఇందులో భాగంగానే గణనాథుని లడ్డును సారంగం వారి వీధికి చెందిన కిన్నెర హరీష్ 56 వేల రూపాయలకి వేలం పాడి స్వామి వారి లడ్డును దక్కించుకున్నారు.ఈ సందర్భంగా సారంగం వారి వీధి యూత్ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలకు తమకు విరాళాలు అందించి,సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.ఈ గ్రామోత్సవ కార్యక్రమంలో సారంగం వారి వీధి యూత్ సభ్యులు,కోట ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కూటమిపాలనకు ప్రత్యక్ష నిదర్శనం

### ఎన్ టీ ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### సర్వేపల్లి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పెంచలరావు

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం సెప్టెంబర్ 1



రాష్ట్రంలో కూటమి పాలనకు ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నిదర్శనమని సర్వేపల్లి నియోజకవర్గటిడిపి పార్టీ పరిశీలకులుదావా పెంచలరావు పేర్కొన్నారు.సచివాలయంలోసోమవారం మండలపార్టీ అధ్యక్షులు కొణతం రఘు బాబు ప్రధాన కార్యదర్శి మన్నెంజితేంద్ర మాజీ ఎంపిటీసీ మన్నెంమధుసూదన్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారుపింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ ద్వారా ప్రతినెల 1వ తేదీ వారి వారి ఇళ్ల వద్ద అందించడంతో వృద్ధులు వితంతువులు వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారుఈ పంపిణీ కార్యక్రమంలోతోటపల్లి గూడూరు పిఎసిఎస్ డైరెక్టర్ మూగరాజ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ధారా వెంకటేశ్వర్లు శివయ్య రాజేష్ పాక వెంకయ్య యూనిట్ ఇన్చార్జిఅరికాటి వెంకటేశ్వర్లు గ్రామ పార్టీ అధ్యక్షులు ఆకులు జై కుమార్ కొణతం శ్రీనివాసులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# APSRTC ఉపాధ్యక్షులుపి.ఎస్. మునిరత్నం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

గుడిపల్లి స్వర్ణ సాగరం న్యూస్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పండుగలో భాగంగా, ఈరోజు కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి మండలం, యామనూరు గ్రామంలోని రెండవ క్లస్టర్ లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి APSRTC ఉపాధ్యక్షులు పి.ఎస్. మునిరత్నం గారు హాజరై, లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: ఎన్టీఆర్ భరోసా పింఛన్ కేవలం ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, విధవలు, వికలాంగులు వంటి అర్హులైన వర్గాల పట్ల చూపుతున్న సానుభూతి మరియు సంక్షేమానికి నిదర్శనం అని తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరి కష్టాలను గుర్తించి, ప్రజల పక్కన నిలబడతుందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అందిస్తామని భరోసా ఇచ్చారు.తదుపరి, స్థానిక ప్రజల సమస్యలను, గ్రామ అభివృద్ధి అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న లాభాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బాలాజీ గారు, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణాచలం గారు స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని ప్రభుత్వం వేగంగా, పారదర్శకంగా అమలు చేస్తోందని ప్రశంసించారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# ఏఎంసి డైరెక్టర్ ప్రసన్నమ్మకు బిజెపి నేత శుభాకాంక్షలు



ఇందుకూరుపేట స్వర్ణసాగరం సెప్టెంబర్ 1

నెల్లూరు ఏఎంసి డైరెక్టర్ గా కుప్పా ప్రసన్నమ్మ ఎంపికైన విషయం తెలిసిందే. బిజెపి సీనియర్ నాయకులు మారు బోయిన శ్రీనివాసులు ఇందుకూరుపేట బిజెపి మండల అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి మరియు సాంబశివారెడ్డి ప్రసన్నమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఎంసీ డైరెక్టర్గా రైతుల సమస్యలను పరిష్కరిస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తపరిచారు

# నేడే వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

### జయప్రదం చేయాలని వైసీపీ శ్రేణులకు గొల్లపల్లి విజ్ఞప్తి

ఇందుకూరుపేట స్వర్ణసాగరం సెప్టెంబర్ 1

మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని 2 వ తేదీ మంగళవారం మండలంలోని డేవీస్ పేటరాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్సిపి సీనియర్ నేత గొల్లపల్లి విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారుఈ వర్ధంతి కార్యక్రమంలోనాయకులు కార్యకర్తలు ఎంపీటీసీలు సర్పంచులు వివిధ హెూదాలలో ఉన్న బాధ్యులు ఈ కార్యక్రమానికి రావలసిందిగా కోరారు

# 2 నసర్వేపల్లి నియోజకవర్గంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధన్తులునిర్వహించాలి

### మాజీ ఏపీ డైరీ ఛైర్మన్చిల్లకూరు విజ్ఞప్తి

నెల్లూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 1

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డివర్ధంతి కార్యక్రమాలు సర్వేపల్లి నియోజకవర్గం లోని ఐదు మండలకేంద్రాలలో నిర్వహించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు వైఎస్ఆర్సిపి సీనియర్ నేత మాజీ ఏపీ డైరీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ వర్ధంతి కార్యక్రమాలలోమండల అధ్యక్షులు జడ్పిటిసి సభ్యులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు

# రథోత్సవం సందర్భంగా రథ కలశం రథసారధి రథం గొడుగులకు ప్రత్యేక పూజలు





కాణిపాకం, సెప్టెంబర్ 1 స్వర్ణ సాగరం

మూడవ తేదీ రథోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం వ్రత కలశం రథసారథి రథం గొడుగులకు ప్రత్యేక పూజలు. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారిని వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 3వ తేదీన రథోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం రథ కలిసం, రథసారథి రథం గొడుగుకు, ప్రత్యేక పూజలు చేసి రథం మీద ప్రతిష్టించ జరిగినది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



వెంకటాచలం స్వర్ణ సాగరం సెప్టెంబర్ 1

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారంవెంకటాచలంలో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు

పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఆదేశాలతోస్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బెడ్ షీట్లు రొట్టె లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ ఆర్భాటాలకు తావు లేకుండా కేవలం సేవా భావంతోసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో తులతూగాలని దైవాన్ని ప్రార్థించారుఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు ఎస్ సాయి శ్వేత శ్రీహరి సుబ్రహ్మణ్యం విష్ణు, సిహెచ్ చెంచయ్య రహీం చిన్న కోలం గారి ఆంజనేయులుతదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వ పాలనలో 1 తేదీ వస్తే అవ్వా తాతలకు పండుగే

### తిరుమలశెట్టి కోటేశ్వరరావు

కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 1







కోట మండలం కోటలో గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆదేశాలు మేరకు,తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ పిలుపుతో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం టీడీపీ కోట మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు సచివాలయ సిబ్బంది తో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని అర్హులకు పెన్షన్ పంపిణి చేశారు.ఈ సందర్భంగాతిరుమలశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూరాష్ట్రంలో ఎటువంటి పెన్షన్లు రద్దు కాలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపియున్నారని,అర్హులందరికీ కూటమి ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని అన్నారు.కూటమి ప్రభుత్వ పాలనలో 1 వ తారీఖు వస్తే అవ్వా తాతలకు పండుగేనని దీనికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ 4000 లకు పెంచటమే కాకుండా వేకువ జామున నిద్ర లేవకముందే వారి ఇండ్ల వద్దకు ప్రభుత్వ అధికారులను, నాయకులనను పంపించి అవ్వా తాతలకు పెన్షన్ అండీంచడమే అని అన్నారు.కూటమి ప్రభుత్వం అందించే పెన్షన్ వల్ల చాలా మంది ఎటు వంటి ఆదరణ లేని అవ్వా తాతలు మూడు పూటలా కడుపు నిండా తిన కలుగుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం నిర్వహించిన శ్రీ రామ కళాశాల



రేణిగుంట స్వర్ణ సాగరం సెప్టెంబరు 01

రేణిగుంట మండలం కరకంబాడి రోడ్ లో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం మరియు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్, జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం వారి సౌజన్యంతో ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ టెక్నాలజీస్ అండ్ అప్లికేషన్స్ అనే అంశం మీద ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమంను ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా డా.చిత్రసేన్ అసోసియేట్ ప్రొఫెసర్, ఐ.ఐ.ఎస్.ఈ.ఆర్. విచ్చేసి కార్యక్రమం ను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం అంతా క్వాంటమ్ టెక్నాలజీ మీద నడుస్తుంది అని అందుకు అనుగుణంగా అందరూ ఈ టెక్నాలజీ ని నేర్చుకొని నూతన అప్లికేషన్స్ పెట్టటానికి ప్రయత్నించాలి అని అందుకు ఈ ప్రోగ్రాం ఎంతో దోహదపడుతుంది అని తెలియచేశారు. కళాశాల డైరెక్టర్ మన్నెం. అరవిందుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రోగ్రామ్స్ నుంచి ఉపాధ్యాయులు కొత్త టెక్నాలజీస్ ని నేర్చుకొని వాటిల్ని విద్యార్థులకు నేర్పుతూ నూతన పరిశోధనలు చేయగలరు అని తెలియచేసారు. ప్రోగ్రాం కన్వీనర్ డా.ఎ. మునిశంకర్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం కి వివిధ కళాశాలల నుంచి యాభై మంది అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు హాజరు అయ్యారు అని ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు ఈ ప్రోగ్రాం జరుగుతుంది అని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రోగ్రాం నిర్వహించటానికి అవకాశం ఇచ్చిన ఎఫ్. డి. సి, జె.ఎన్. టి. యూ మరియు కళాశాల యాజమాన్యం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం. రామసుబ్బారెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గణనాథుని సేవలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్



కాణిపాకం, సెప్టెంబర్ 1 స్వర్ణ సాగరం

గణనాథుని సేవలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు కపిల్ దేవ్ అగర్వాల్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , వీరికి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన డీఈఓ సాగర్ బాబు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, వాసు, తదితరులు ఉన్నారు.

# ఉదయం చిలక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ఘననాథుడు



కాణిపాకం , సెప్టెంబర్ 1 స్వర్ణ సాగరం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చిలక వాహనంపై కాణిపాకం గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చిన గణనాథుడు. కాణిపాకం ఆర్య వైశ్యులు ఉభయదారులగా వ్యవహరించారు. వరుస తీసుకురాగా అర్చక స్వాములు కళ్యాణ వేదిక మీద స్వామివారి మూలవిరాట్ కు పంచామృతం అభిషేకం నిర్వహించి చక్కగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ధూప దీప నైవేద్యములను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలొ ఆలయ కార్య నిర్వహణ అధికారి పెంచల కిషోర్ ఆలయ అధికారులు, ఉభయదారుల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గణనాథుని వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం నుండి పట్టు వస్త్రాలు సమర్పణ





## పట్టు వస్త్రాల ను సమర్పించిన శ్రీ కాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి

కాణిపాకం, సెప్టెంబర్ 1 స్వర్ణ సాగరం

కాణిపాక గణనాథుని వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీ కాళహస్తి దేవస్థానం నుండి పట్టు వస్త్రాలు సమర్పించిన శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం శ్రీకాళహస్తి నుండి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ , మరియు శ్రీకాళహస్తి దేవస్థానం ఈ.వో బాపిరెడ్డి , స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం డీఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, ఏఈవోలు రవీంద్రబాబు, ధనంజయ, ధనపాల్, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, బాలాజీ నాయుడు, వేద పండితులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంసందర్శించిన విస్తరణ సంచాలకులు డా. జి. శివనారాయణ

నెల్లూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 1

నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రాన్నిసోమవారం వ్యవసాయ విస్తరణ సంచాలకులుడాక్టర్ జి శివ నారాయ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్టులు రూపొందించిన సాంకేతిక కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణా కార్యక్రమాలు మరియు విస్తరణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. డైరెక్టర్ గారు మాట్లాడుతూ, “రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే ఆధునిక సాంకేతికతను సమయానికి అందించడం అత్యవసరం. ఈ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఉపయోగపడేలా మరిన్ని కొత్త ఆవిష్కరణలను పరిచయం చేయాలి. పంటల వైవిధ్యకరణ, విలువ వృద్ధి, మార్కెటింగ్ లింకేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి” అని సూచించారు. అలాగే %చీఖీణదీ% ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, శిక్షణార్థులతో మమేకమై వారి అభిప్రాయాలను విన్నారు. శిక్షణ పొందిన రైతులు, మత్స్యకారులు తమ అనుభవాలను పంచుకుంటూ, “ఇలాంటి శిక్షణలు మాకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. సాంకేతికతను నేర్చుకొని మా వృత్తి అభివృద్ధికి వినియోగించుకుంటున్నాం” అని తెలిపారు. తరువాత డైరెక్టర్ కృషి విజ్ఞాన కేంద్రంలోని ప్రదర్శన యూనిట్లను పరిశీలించారు. పంటల విభాగం, పౌల్ట్రీ, మత్స్య పెంపకం, తేనేటీగల పెంపకం, వర్మీ కంపోస్ట్ యూనిట్లు వంటి విభాగాల్లో ఏర్పాటు చేసిన డెమో యూనిట్లను సందర్శించి, “రైతులకు ప్రత్యక్షంగా చూపించడం వలన సాంకేతికతపై అవగాహన పెరుగుతుంది. వీటిని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలి” అని అన్నారు. ఈ సందర్భంగా %హజ్రూ% లబ్ధిదారులకు సికేచర్స్, ఇన్క్యుబేటర్లు, స్ప్రేయర్లు, మరియు ఇతర వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ పరికరాలను స్వీకరించిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ, “ఈ పరికరాలు మాకు ఉత్పత్తి పెంపుకు, శ్రమ తగ్గించుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి. ఇలాంటి సహకారం వల్ల గ్రామీణ యువత కూడా వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం పొందుతుంది” అని అభిప్రాయపడ్డారు. డైరెక్టర్ అదనంగా, డిజిటల్ ఎక్స్టెన్షన్ సేవలు, మొబైల్ యాప్ల ద్వారా రైతులకు సలహాలు, వాతావరణ సూచనలు, మరియు మార్కెట్ సమాచారం అందించడంపై కూడా చర్చించారు. రైతులు మార్కెట్లో మెరుగైన ధరలు పొందేందుకFPO%\ (%Farmer Producer Organizations%) ను బలోపేతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో %ఖఎఖ% శాస్త్రవేత్తలు, సిబ్బంది రైతులు, మహిళా సంఘాలు, యువకులు పాల్గొన్నారు.



# బ్రిలియంట్ పాఠశాలలో ఘనంగా వినాయక నిమజ్జనం వేడుకలు



స్వర్ణసాగరం డోర్నకల్ సెప్టెంబర్ 01

డోర్నకల్ మండలంలోని బ్రిలియంట్ పాఠశాల వినాయక నిమజ్జనం వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.అ పాఠశాల కరస్పాండెంట్ వక్కంతుల అప్పారావు, ప్రిన్సిపాల్ అప్సర్ బేగం, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు,5 రోజుల పాటు పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా భజన కార్యక్రమాలు, నృత్యాల నడుమ నిమజ్జన శోభయాత్రను నిర్వహించారు.లడ్డు వేలంపాటలో పదవ తరగతి విద్యార్థులు 5 కేజీల లడ్డును దక్కించుకున్నారు.

# పరిష్కారం కాని గిరిజన సమస్యలు

## పట్టించుకోని అధికారులు


## యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పోట్లూరి విమర్శ

నెల్లూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 1



ఆంధ్రప్రదేశ్ లో గిరిజనుల సమస్యలు సంవత్సరాల తరబడి పరిష్కారం కాక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు యానాదిస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు విమర్శించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. దగదర్తి మండలం వెలుపోడు గిరిజన కాలనీలో సుమారు 30 కుటుంబాల చల్లా యానాదులకు త్రాగునీటి వసతి కొరకు వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారని వారి అవసరాలకు సరిపోకపోవడంత5000లీటర్ల సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు వాస్తవాలు విచారించి రిపోర్టు ఇచ్చ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఎస్టిమేట్ చేయాలని ఆదేశించిన ఐటీడీఏ వారి వద్ద నిధులు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు

# తిరుపతి ఎంఆర్ పల్లి శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

తిరుపతి ఎంఆర్ పల్లిలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన వినాయక మండపం వద్ద ఆరు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాద వితరణలో పాలుపంచుకున్నారు. ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ మన్నూరి సుగుణమ్మ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు చిన్న బాబు, టిడిపి నాయకులు మునిశేఖర్ రాయల్, బిరుదుల హనుమంత్ రెడ్డి, వినాయక కమిటీ సభ్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నప్రసాదం అందించడం ద్వారా సామాజిక సేవా కార్యక్రమంలో తమ వంతు పాత్ర పోషించినందుకు నిర్వాహకులను అభినందించారు. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో భాగంగా ఈ అన్నదాన కార్యక్రమం ముఖ్యమైనదిగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటుగా అన్నదాన సంతృప్తి కూడా కలిగింది. కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. ప్రతి సంవత్సరం ఇదే విధంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని భక్తులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో సామరస్యం మరియు సోదరభావం పెంపొందుతాయని ఆశిస్తున్నారు.

## నేడు వైఎస్ఆర్ వర్ధంతి



స్వర్ణ సాగరం ఓజిలి సెప్టెంబర్ 01:

మండల కేంద్రమైన ఓజిలి గ్రామంలోని వైయస్సార్ విగ్రహం వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్ రెడ్డి తెలియజేశారు.

## వరదయ్యపాలెంలో మద్యం షాపుల తనిఖీ

వరదయ్యపాలెం స్వర్ణ సాగరం సెప్టెంబర్ 01



రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం వరదయ్యపాలెంలోని పలు మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు .చిత్తూరు ఎన్ఫోర్స్మెంట్ సీఐ సత్యనారాయణ నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి.ఈ తనిఖీల్లో దుకాణాల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయించవద్దని,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు హెచ్చరించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో చిత్తూరు ఎన్ఫోర్స్మెంట్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్రయ్య,కానిస్టేబుల్ రాజ్ దీప్,విజయ్,గీత పాల్గొన్నారు.

## పేదలకు పింఛన్ల పంపిణీ వరం

### టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు



స్వర్ణ సాగరం ఓజిలి,సెప్టెంబర్ 01:

పేద ప్రజలకు పింఛన్ల పంపిణీ చేయడం వరమని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. మండలంలోని పున్నేపల్లి గ్రామంలో సామాజిక పింఛన్లను సోమవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సాధ్యమవుతుంది అన్నారు. సామాజిక పింఛన్లను 3000 నుంచి 4000 వరకు పెంచి పేదలను ఆదుకున్నారని తెలియజేశారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు సమపాళ్లలో అందిస్తున్నారని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలను పేద ప్రజలకు అందించి వారికి ఆపద్బాంధవుడు అయ్యాడని చెప్పారు. ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఉన్నారని లబ్ధిదారులు సుఖ సంతోషాలతో తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారని చెప్పారు. రాను ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకుడు బాలయ్య నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# స్విమ్స్ ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం పిహెచ్సీల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

### వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ ప్రశాంత్.



వరదయ్యపాలెం స్వర్ణ సాగరం సెప్టెంబర్ 01

టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం బిఎన్.కండ్రిగ మండల కేంద్రంలోని పిహెచ్సీలో, వరదయ్యపాళెం మండల కేంద్రంలోని పిహెచ్సీలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.సెప్టెంబరులో పింక్ బస్ క్యాంపుల వివరాలుసెప్టెంబర్ 4న గొల్లపల్లి, జయంపు.సెప్టెంబర్ 8న వడమాలపేట, పరమేశ్వర మంగళం.సెప్టెంబర్ 11న కుప్పంబాదూరు, కమ్మపల్లి.సెప్టెంబర్ 15న పాకాల, దామలచెరువు.సెప్టెంబర్ 18న దామినేడు, రేణిగుంట.

సెప్టెంబర్ 22న మంగళం, తారకరామానగర్.

స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఓ ప్రసాద్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, స్థానిక నాయకులు సుధాకర్ నాయుడు, మునిసుబ్బయ్య, ఉషారాణి, సిహెచ్ఓలు వెంకటేష్, కృష్ణమరాజు, సూపర్వైజర్ జ్యోతి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనహృదయ నేతకు 16 వర్ధంతి

-చింతల. శ్రీనివాసులరెడ్డి

స్వర్ణ సాగరం ప్రతినిధి దక్కిలి



తిరుపతి జిల్లాదక్కిలిమండలం వై ఎస్ ఆర్ పార్టీఅధ్యక్షులు చింతల. శ్రీనివాసులరెడ్డి మీడియా ధ్వారా మండలంలో ని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, వెల్లంపల్లి రోడ్ దగ్గరఉన్నవైఎస్ ఆర్విగ్రహానికిని వాళలుఅర్పి ంచాలని,తెలియ జేసారు.తరువాతవెంకటగిరిలోని ని వాళులు అర్పించనున్న వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి16వవర్ధంతి సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డినేదురుమల్లినివాసంలోనివాళు లుఅర్పించునున్నారు.అనంతరంనేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులకుఅందుబాటులోఉండనున్నారు. కావున దక్కిలి మండలంలోనినాయకులు, కార్యకర్తలు.అభిమానులు. మండల కమిటీ, జిల్లా కమిటీసభ్యులు పాల్గొనాలనిదక్కిలిపార్టీ అధ్యక్షలుశ్రీని వాసులరెడ్డితెలియజేసారు.

## నిడి ముసిలి వినాయక లడ్డు రూ. 19,000



ఇందుకూరుపేట స్వర్ణ సాగరం సెప్టెంబర్ 1

మండలంలోని నిడి ముసిలి గ్రామంలో వైభవంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వినాయకుని లడ్డు వేలంపాట నిర్వహించారు. బిజెపి మండల ప్రధాన కార్యదర్శి లేబూరు రవి కుమార్ రెడ్డి రూ 19వేలకు పాట దక్కించుకున్నారు లేబూరు సుకుమార్ రెడ్డి బత్తిన సాయికుమార్ రెడ్డి ఏ అనిల్ కుమార్ తో పాటు ఉత్సవ కమిటీ కన్వీనర్లు డి వెంకటేశ్వర్లు వి శివ కోటయ్య కే లక్ష్మణరావు భక్తులు పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన



స్వర్ణ సాగరం ఓజిలి, సెప్టెంబర్ 01:

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రకృతి వ్యవసాయ ఓజిలి ఇన్చార్జి జైబున్ బీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. గ్రామాల్లోని సిబ్బంది తీసుకువచ్చిన కూరగాయలు, ఆకుకూరలు, నిమ్మకాయలు ను ప్రజలకు విక్రయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువులు బదులుగా కషాయాల తో తయారు చేసే ఉత్పత్తులను వాడడం కారణంగా పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మంచిదని తెలియజేశారు. రసాయనిక ఎరువులు వాడకంతో కూరగాయల పై అవశేషాలు ఉండి ప్రజలను అనారోగ్యాల బారిన పడతారని తెలియజేశారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహజ సిద్ధంగా లభించే ఆకులు, ఆవు మూత్రం లతో కషాయాలను తయారుచేసి విక్రయిస్తున్నారన్నారు. పురుగు మందులకు బదులుగా రైతులు కషాయాల ను వాడకంతో పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయం వస్తుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, గురవయ్య, చెంచమ్మ, యామిని, ధనుంజయ, మహేశ్వరి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం



స్వర్ణ సాగరం ఓజిలి సెప్టెంబర్ 01:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఓజిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య ను ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఇటీవల వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించడం జరిగిందన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షునిగా ఎన్నికైన మేకల లక్ష్మయ్య నాయుడుపేట వైఎస్ఆర్సిపి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఎస్సీ సెల్ అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాషా లకు రుణపడి ఉంటానని తెలియజేశారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కర్రబల్లవోలు సర్పంచ్ ఎల్లా సురేష్ రెడ్డి, చేనేత విభాగం అధ్యక్షుడు ఎద్దు పెంచలయ్య, నాయకులు పిండుకూరు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం



# కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు కాణిపాకం శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున కాణిపాకం వినాయక స్వామి వారికి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు ఇతర అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు.శ్రీ కాళహస్తీశ్వరాలయం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడానికి విచ్చేసిన శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులను కాణిపాకం ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు ఇతర అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం శాసనసభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శాసనసభ్యులు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయ పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి




తవణంపల్లె స్వర్ణసాగరం, సెప్టెంబర్ 1:

కాణిపాకం–చిత్తూరు రహదారిపై దారుణ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నిన్న (31వ తేదీన) సిఎన్ఆర్ కళ్యాణమండపం సమీపంలో వెళున్న చిత్తూరు పట్టణం మురుగనపల్లి ప్రాంతానికి చెందిన ఈజిల్ అరసన్ మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనతో పాటు ఒక పాదాచారి కూడా గాయపడ్డారు.గాయపడిన వారిని స్థానికుల సహకారంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం పొందిన ఈజిల్ అరసన్‌ను మెరుగైన వైద్యం కోసం రాణిపేట సిఎంసి కి తరలించగా, అనంతరం వేలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అయితే చికిత్స పొందుతూ ఆయన ఈ రోజు ఉదయం 11:10 గంటలకు మృతిచెందారు. మృతుడి భార్య పి. పూజిత (40 సంవత్సరాలు), భర్త పి.ఎస్. ఈజిల్ అరసన్, "కామేశ్వరనగర్, మురుగనపల్లి, చిత్తూరు పట్టణం %డ% జిల్లా" పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తవణంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పవర్ లిఫ్టింగ్ వర్కింగ్ అధ్యక్షుడు గా దేవ సింగ్



స్వర్ణసాగరం డోర్నకల్ సెప్టెంబర్ 01:

మహబూబాబాద్ పవర్ లిఫ్టింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కే.దేవ్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్టేట్ పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రెటరీ తెలియజేశారు. ఆదివారం డోర్నకల్ పట్టణంలోని బుల్లెట్ ప్రూఫ్ వ్యాయామశాల ఆవరణంలో ఎన్నికల నిర్వహించారు.జనరల్ సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్ సమక్షంలో ఎన్నికలు జరిపారు.అధ్యక్షుడు ఎస్.సీతారాములు,ప్రధాన కార్యదర్శి బుట్టి అశోక్,వైస్ ప్రెసిడెంట్ జి,వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీలు ఎం.కార్తీక్, వాసుదేవ నాయుడు,కోశాధికారి మారబోయిన రాంబద్రం ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. డోర్నకల్ పట్టణంలో యువత సన్మార్గంలో నడుస్తూ పవర్ లిఫ్టింగ్ శిక్షణ పొందడం ద్వారా ఆత్మస్థైర్యం, ఆరోగ్యం చేకూరుతాయని పేర్కొన్నారు.వ్యాయామశాలల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

# చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

## మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వెల్లడి



పెల్లకూరు స్వర్ణసాగరం సెప్టెంబర్ 1.

జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ను స్వగ్రామం పెళ్ళకూరులో ఏర్పాటు చేసి తద్వారా విస్తృతంగా అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వెల్లడించారు. సోమవారం చాగణం ట్రస్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలు వేద పండితుల మంత్రాచార్యులు నడుమ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుటుంబ సభ్యులకు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, చాగణం ట్రస్టీ చాగణం గౌరీ శంకర్ దంపతులు కుటుంబ సభ్యులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి మనిషి ఆర్థిక ప్రగతిలో భాగంగా కష్టపడి సరైన మార్గంలో సంపాదించడం మంచి కర్తవ్యం అని, సంపాదించిన దానిలో ఇతరుల అభివృద్ధి కోసం కొంత కేటాయించడం వ్యక్తి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఈక్రమంలో చాగణం గౌరీ శంకర్ తమ తల్లిదండ్రుల పేరుతో నిర్మించిన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం, ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం స్లాగనీయం అన్నారు.

చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనాల కింద ట్రస్ట్ ఎంపిక చేసిన అర్హులైన 78మంది విద్యార్థులకు గాను 58 మంది విద్యార్థులకు సంవత్సరానికి రూ.25వేలు చొప్పున రూ 14.50 లక్షలు, మరో 20మంది విద్యార్థులకు సంవత్సరానికి రూ.10వేలు చొప్పున రూ 2 లక్షలు మొత్తం రూ16.50 లక్షలు విలువైన ఉపకార వేతనాల చెక్కులను విద్యార్థులకు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందజేశారు. మానవ సేవే మాధవ సేవ అన్న భావంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు గౌరీ శంకర్ ని అభినందించారు. ప్రతి గ్రామంలో దేవాలయం, గ్రంథాలయం, విద్యాలయంతో పాటు సేవాలయం కూడా ఉండాలని సూచించారు. పెల్లకూరులో సామాన్యులకు సేవ చేసేందుకు చాగణం ట్రస్ట్ సేవాలయం గౌరీ శంకర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను మరవకుండా యువతను సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులు, సమాజం మీద ఉందన్నారు. ఒకప్పుడు ప్రపంచానికి భారతదేశం ఆది గురువు అని వెల్లడించారు. నలంద, తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాలలో అనేక మంది పొరుగు దేశస్తులు విద్యను అభ్యసించారన్నారు. అయితే గజినీ మహమ్మద్, మహమ్మద్ బిన్ తుగ్లక్ దండయాత్రల వల్ల పలు విశ్వవిద్యాలయాలు నేలమట్టం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవం ఉన్న ప్రతి ప్రాణి స్వేచ్ఛగా జీవించడానికి హక్కు కలిగి ఉందని, వృక్షాలను, జంతువులను కాపాడడం మనందరి కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.

**అలసిన జీవితానికి ప్రజాసేవతో రీఛార్జ్ : చాగణం ట్రస్ట్ గౌరీ శంకర్...** ప్రతి మాసంలో 27 రోజులు కష్టపడి పనిచేసి అలసిపోయినప్పుడు పెళ్ళకూరులో ఉన్న తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో మూడు రోజులు ఆహ్లాదంగా గడిపితే మానసికంగా రీఛార్జ్ అవుతానని చాగణం ట్రస్ట్, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌరీ శంకర్ పేర్కొన్నారు. పచ్చని చెట్లు, ఆహ్లాదమైన వాతావరణం, ట్రస్ట్ సేవల్లో భాగస్వాములైన సీఈవో సీతారామయ్యతో పాటు ట్రస్ట్ లో పని చేసే అందరూ కూడా శక్తి వంచన లేకుండా పని చేయడం వల్ల చాగణం ట్రస్ట్ సేవలను పలు జిల్లాల వ్యాప్తంగా విస్తృతం అవుతున్నట్లు వెల్లడించారు. అందరి సహకారం వల్లే సరైన మార్గంలో సంపాదించిన దానిలో కొంత పేదల అభివృద్ధి కోసం కేటాయించడం, పేదలకు సాయం చేయడం వల్ల చాలా తృప్తి కలుగుతుందన్నారు. శ్రీమతి దీపా వెంకట్ వెంకటాచలంలో ఏర్పాటు చేసి ఉన్న స్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రేరణగా పొంది తల్లిదండ్రుల పేరుతో పెల్లకూరులో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తద్వారా మొక్కల పెంపకం, వివాహాది శుభకార్యాలకు వికాస్ కన్వెన్షన్ సెంటర్, ప్రతిరోజు వైద్య శిబిరాలు, రక్త నమోనాల సేకరణ, వికలాంగులకు ట్రై సైకిళ్లు, కుల వృత్తుల వారికి చేయూత, కంటి వైద్య శిబిరాల ద్వారా కంటి వైద్య పరీక్షలు, ఉచితంగా శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలు పంపిణీ, దూర ప్రాంతాలకు ట్యాంకర్లతో త్రాగునీరు సరఫరా, నైపుణ్యా శిక్షణ కేంద్రాల ద్వారా కంప్యూటర్, డ్రైవింగ్, కుట్టు మిషన్, ఎంబ్రాయిడింగ్, అల్లికలు శిక్షణ పొందిన వారికి సర్టి ఫికెట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. పేదరికం చదువుకు ఆటంకం కలగకూడదని పేద విద్యార్థులకు లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనం అందిస్తున్నట్లు చెప్పారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గౌరీ శంకర్ చేస్తున్న సేవలు యువతకు ఆదర్శంగా నిలవాలి అన్నారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని చెప్పారు.స్వర్ణభారత ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీప వెంకట్ మాట్లాడుతూ గౌరీ శంకర్ ఏర్పాటు చేసిన ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువత స్వయం ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో సీఈవో సీతారామయ్య, ట్రస్ట్ ప్రతినిధులు రాయసం హృషి కేశవరావు, రాయసం శ్రీలక్ష్మి, రంగినేని కృష్ణయ్య, శ్యామ్ బన్సల్, చంద్రశేఖర్ రెడ్డి, బోస్ రాజు, చాగణం వరలక్ష్మి, శ్రీ విన్య, కావ్య, శ్రావ్యతో పాటు గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







# శ్రీకాళహస్తి పట్టణంలో గణేష్ మహారాజ్ హెూమం వైభవంగా





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

గత కొన్ని సంవత్సరాలుగా కొండమిట్ట వినాయక స్వామి కమిటీ సభ్యులు మరియు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ నేతృత్వంలో శ్రీకాళహస్తి పట్టణంలోని బేరివారి మండపంలో మట్టి వినాయకుని ఉత్సవాలలో భాగంగా ఈరోజు గణేష్ మహారాజ్ యొక్క హెూమం వేదమంత్రాల సాక్షిగా అత్యంత వైభవంగా జరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ సి వి నాయుడు మరియు కూటమి నాయకులు అతిథులుగా హెూమ కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేళా గారం సుబ్రమణ్యం రెడ్డి, తెలుగుదేశం నాయకులు చెంచయ్య నాయుడు, ముని రాజా నాయుడు, రెడ్డివారి గగురువారెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, పేట బాలాజీ, మోరే ఉమేష్, నాగమల్లి దుర్గప్రసాద్, రామిశెట్టి సాయి, వజ్రం కిషోర్, రెడ్డి నెమల్లూరు బుజ్జి, రాజు, ఢిల్లీ, కిట్టు, జనసేన కొట్టేసాయి, కోనేటి అయ్యప్ప, వినయ్, బిజెపి మండల అధ్యక్షులు ఏడం కృష్ణయ్య, హరీష్ రెడ్డి, భగీర్తి వెంకటేష్, తిరుమల శెట్టి నరేష్, ప్రేమ్ కుమార్ రెడ్డి, పుల్లమ నాయుడు, కుమార్ నాయుడు, ధర్మయ్య, అమర్నాథ్, వాసు, లింగా బత్తిన గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, పుణ్యం ఢిల్లీ కుమార్, చందు రాయల్, యువమోర్చా సభ్యులు తానికొండల భరత్ నాయుడు, చోటు, పవన్, రవి రాయల్, ధనుష్, గిరిధర్ సాయి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం



స్వర్ణసాగరం–వెంకటగిరి టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపకులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని.జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు అనిల్‌కుమార్ రామారావు.ఆధ్వర్యంలో వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ .వి. రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు నాయకులు వీర మహిళలు రక్తదానం చేయడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయడంలో వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాల నుంచి డాక్టర్ ఎస్.కే. జిలాని, డాక్టర్ సాయి సతీష్,డాక్టర్ లక్ష్మీనారాయణ మరియు వారి వైద్య సిబ్బంది కీలక పాత్ర వహించారు. అనంతరం రక్తదాతలకు భోజన సదుపాయం కల్పించిన నెల్లూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి శ్రీమతి చామ్మడి రాధమ్మ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన జనసేన పార్టీ నాయకులు అరవరా జేష్, కోన రవిశంకర్. ఫణి కుమార్. ఎద్దు రామ్మోహన్, మైనార్టీ సంఘ అధ్యక్షులు ఎస్కే రిజ్వాన్, నీటి సంఘం నాయకులు పులి శీను,బిజెపి ప్రధాన కార్యదర్శి పిల్లిల మల్లి, వీరమహిళ పువ్వాడి ప్రవల్లిక, పువ్వాడి నరేష్ , సుజాత, వరలక్ష్మి తో పాటు పలువురు స్థానిక నాయకులను, అభినందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యుదయంగా అహర్నిశలు కృషి చేస్తున్న తమ నాయకుడు రాష్ట్ర డిప్యూటీ సీఎం ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ సెప్టెంబర్ 2వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు వెంకటగిరి పాత బస్టాండ్ వద్ద పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరపనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ అభిమానులు జనసైనికులు వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం నూతన సంస్కరణలు





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. దేవస్థానం నందు వివిధ సేవలకు సంబంధించిన టికెట్లు, ప్రసాదాలు, ఇతర సదుపాయాల కోసం గల అన్ని కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేయాలనే భక్తులకు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో నూతనంగా ఒక షెడ్డును నిర్మించారు. ఈ షెడ్డు నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో, అందులో కౌంటర్ల ఏర్పాటు ప్రక్రియ ఎలా జరుగుతుందో స్వయంగా పరిశీలించారు ఎమ్మెల్యే. కౌంటర్ల ఏర్పాటు, భక్తులకు అందుబాటులో ఉండే విధంగా సరైన వరుస క్రమంలో ఉన్నాయా, అన్ని కౌంటర్లకు సరిపడా సిబ్బంది నియామకం జరిగిందా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయా అనే అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అంతేకాకుండా, కౌంటర్ల నిర్వహణ, భక్తుల సౌకర్యం, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై అధికారులతో చర్చించి, వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. దేవస్థానాన్ని సందర్శించే భక్తులకు సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త కౌంటర్ల వ్యవస్థ వలన భక్తుల సమయం ఆదా అవుతుందని, అంతేకాకుండా అన్ని సేవలను ఒకే చోట పొందే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు

# రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజల హక్కులను కాపాడుకుందాం.

కనిగిరి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 01

రాజ్యాంగాన్ని రక్షించుకొని ప్రజల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రిటైర్డ్ ఉపాధ్యాయులు పాప బత్తిన నారయ్య అన్నారు.సోమవారం కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రతినెల ఒకటో తేదీ అంబేద్కర్ ధర్మ పోరాట సమితి చదలవాడ బాల గురవయ్య ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం రక్షణ ప్రజల బాధ్యతని రాజ్యాంగం ఉంటేనే ప్రజల హక్కులు కాపాడగలుగుతాయని అన్నారు రాజ్యాంగం ద్వారా అట్టడుగు వర్గాలు మహిళలకు రాజ్యాంగం భద్రత కల్పించగలిగిందని అన్నారు ఈ సందర్భంగా అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాల గురవయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాప బత్తిని నారయ్య మాట్లాడుతూ పాలకులు ప్రస్తుతం రాజ్యాంగాన్ని తుంగలోతకి సొంత రాజ్యాంగాలను ప్రవేశపెడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాలను సైతం పట్టించుకోకుండా ప్రజలకు హక్కులను భంగం



కలిగిస్తున్నారని అన్నారు అంతకుమునుపు బీసీ ఐక్యవేదిక నాయకులు పల్లా మాలకొండలరావు, శాలివాహన సంఘం నాయకులు ఓబులేసు, కోలనీడి బాలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, మాజీ బి టి ఏ నాయకులు చీమలదిన్నె వెంగయ్య, మాల జేఏసీ జిల్లా నాయకులు కల్వకురి శాంతరాజు, ప్రముఖ న్యాయవాది చింతగుంట్ల కిషోర్, నియోజకవర్గ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులుకొటికల బాలబాదుర్ల, జొన్నలగడ్డ చిన్న వెంకటయ్య,రిటైర్డ్ ఉపాధ్యాయులు పందిటి పలుకూరి భాస్కర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెంక్షన్స్ పంపిణి చేయాలి



## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 01

పేద బడుగు బలహీన వర్గాల కష్టాలను, ముఖ్యంగా వృద్ధులు మరియు వితంతువులు వికలాంగుల కష్టాలను తగ్గించడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు పెన్షన్లు ఒక ప్రధాన సంక్షేమ పథకమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.సోమవారం కనిగిరి పట్టణంలోని కాశీ రెడ్డి కాలనీలో సచివాలయ ఉద్యోగులతో కలసి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హత పొందిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం కోటమీ ప్రభుత్వం వచ్చిన తరువాత దివ్యాంగులకు తాత్కాలికంగా అనర్హత జాబితా విడుదల చేసి పెంక్షన్స్ దారులకు ఇబ్బంది కరంగా కలిగించడం జరిగింది. కనుక అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెంక్షన్స్ పంపిణి చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు స్థానిక నాయకులు అంజయ్య శ్రీను మురళి పెన్షన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కురుబ సంఘం అధ్యక్షులుగా ఎంసీ కృష్ణప్ప..

వి కోట స్వర్ణ సాగరం సెప్టెంబరు 1



చిత్తూరు జిల్లా వి కోట మండల నూతన కురబ కుల సంఘాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగభూషణం నేతృత్వంలో ఎంపిక చేశారు. సోమవారం వీకోటలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో జరిగిన సమావేశంలో మండల కురబ కుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షులుగా దొడ్డిపల్లి కి చెందిన ఎమ్.సి.కృష్ణప్ప, ఉపాధ్యక్షులుగా యాలకులు చెందిన శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా కమ్మేపల్లికి చెందిన సి.అమర్ గౌడ్, కోశాధికారిగా బెల్లకుంటకు చెందిన కె.అమర్నాథ్ గౌడ్, గౌరవాధ్యక్షులుగా బి. సి.పల్లి చెందిన జయప్ప చింతమాకులపల్లి చెందిన రాధాకృష్ణ గౌడు, మండల యూత్ అధ్యక్షులుగా వెంకటపల్లి చెందిన సురేష్ లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కురబ సంఘ నాయకులు విశ్వనాథ్, బలరాం, జయరామే గౌడు, ఈశ్వర్, మూర్తి, ఉమాపతి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికి పెంక్షన్ పంపిణి



## కమిషనర్ పిల్లి కృష్ణ మోహన్ రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 01

ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగులు,ఆరోగ్య పింఛన్ల లబ్ధిదారులు అప్పీల్ చేసుకున్న అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు కనిగిరి మునిసిపల్ కమీషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు.సోమవారం పట్టణంలోని బి.సి కాలనీ, శివనగర్ కాలనీలో తదితర ప్రాంతాల్లో సచివాలయం ఉద్యోగులతో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కమీషనర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతి

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్



మనందరికీ ఆరాధ్యదైవం, ప్రజల నాయకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత, స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2వ తేదీన (మంగళవారం) ఉదయం 10:30 గంటలకు శ్రీకాళహస్తి పట్టణంలోని వైయస్సార్ సర్కిల్ నందు గల వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించబడును. వారి అమర స్మృతికి చిహ్నంగా, ఆయన చేసిన సేవలకు గుర్తుగా, ఆయన ఆశయాలను స్మరిస్తూ, మనందరం కలిసి పుష్పాంజలి ఘటిస్తూ, వారికి శ్రద్ధాంజలి చేసుకుందాం. వైయస్సార్ జీవితం మనందరికీ ఒక ప్రేరణ. ఆయన ప్రజల మనిషి. పేదల పక్షపాతి. రైతుల బాంధవుడు. ఆయన చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ళు వంటి పథకాల ద్వారా లక్షలాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన స్మృతిని చిరస్థాయిగా నిలిచిపోయేలా చేయడమే మన కర్తవ్యం. నివాళులర్పింపు అనంతరం అక్కడే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. దీని ద్వారా వైయస్సార్ సేవా నిరతిని స్మరిస్తూ, ఆయన ఆదర్శాలను అనుసరిస్తూ, పేదలకు అన్నం పెట్టడం ద్వారా ఆయనకు నిజమైన శ్రద్ధాంజలి అర్పించిన వారవుతాము. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వారి తో పాటు పలువురు ప్రముఖ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. కావున శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అందరూ తప్పక ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. మీ సహకారం మరువలేనిది.

# శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పెన్షన్లు, విత్తనాల పంపిణీ



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈరోజు శ్రీకాళహస్తి మండలం, కాపుగున్నేరి గ్రామంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు.అదే కార్యక్రమంలో రైతులకు జీలగ, నవరత్నాలు విత్తనాలను కూడా శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు శ్రీ బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి , పవన్ కళ్యాణ్ మరియు మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాగానే మూడు వేల రూపాయలు ఉన్న పెన్షన్ను నాలుగు వేలకు పెంచి, ప్రతినెల ఒకటో తారీఖున ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారని తెలిపారు. పేద ప్రజలపై వారికి ఎంత ప్రేమ ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని, పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూస్తే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వికలాంగుల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ తనుజా రెడ్డి



స్వర్ణ సాగరం - వెంకటగిరి టౌన్

వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు పారవోలు గ్రామ పంచాయతీలో ఈరోజు ఉదయం 6:30 గంటలకు వెంకటగిరి మండల ఎంపీపీ తంబిరెడ్డి తనూజ శివారెడ్డి, ఎంపీడీవో ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తోట రామచంద్రయ్య, గ్రామ సర్పంచ్ అమ్మలు, వీరస్వామి, తోట గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# శ్రీకాళహస్తి పట్టణ అభివృద్ధి సమీక్షా సమావేశం




స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని శ్రీకాళహస్తి పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు.

అనంతరం, ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన సూచనలు అందించారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజల అవసరాలను ప్రాధాన్యతగా తీసుకుని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అధికారులు ప్రజలకు సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని నొక్కి చెప్పారు. పట్టణ ప్రగతికి అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

# వినాయకుని విగ్రహాన్ని కాలితో తన్నిన వ్యక్తి పై చర్యలు తీసుకోండి ఆలయ ధర్మకర్త నాగరాజు

బంగారుపాలెం.స్వర్ణ సాగరం.సెప్టెంబరు 1



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండల పరిధిలోని వెలుతురు చేను పంచాయతీ కి చెందిన కోలావారిఇండ్లు గ్రామంలో ఆదివారం అదే గ్రామానికి చెందిన మొగిలీశ్వర్ కుమారుడు నవీన్ కుమార్ మద్యం మొత్తులో గ్రామంలో గల ఆలయం నందు గల వినాయక విగ్రహాన్ని కాలుతో తన్ని కింద పడిపోవడం తో ఆలయ ధర్మకర్త తీవ్ర ఆవేదన చెందారు ఈ సందర్భంగా సోమవారం ఆలయ ధర్మకర్త నాగరాజు మాట్లాడుతూ 2012 సంవత్సరంలో కోలా వారి ఇండ్లు గ్రామస్తులు ఆలయ ధర్మకర్త నాగరాజును వినాయక స్వామి ఆలయం నిర్మించాలని గ్రామస్తులు తెలపడంతో స్పందించిన ఆలయ ధర్మకర్త నాగరాజా తన సొంత నిధులతో వినాయకుని ఆలయం నిర్మించి గ్రామస్తులకు అంకితం చేశారు గత 12 సంవత్సరాలుగా వినాయకుని పూజిస్తున్న గ్రామస్తులు ఏ కష్టం నష్టము లేకుండా గ్రామంలో ఉన్నారని తను వినాయకుని ఆలయం నిర్మించిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందానని బెంగళూరుకు చెందిన షిరిడి సాయి ఆలయ ట్రస్ట్ అధినేత నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు అలాగే విగ్రహాన్ని తన్నిన నవీన్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని బంగారుపాళ్యం అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ కత్తి శ్రీనివాసులకు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు

# డియస్సీ లో డబుల్ విక్టరీ సాధించిన అణగారిని ఆణిముత్యం



**స్వర్ణసాగరం ప్రతినిధి దక్కిలి**

సెప్టెంబర్ 01: డీయస్సీ 2025 ఉపాధ్యాయ ఎంపిక ఫలితాలలో దక్కిలి మండలం ఆల్తూరుపాడు మాలపల్లి కి చెందిన పల్లి ప్రసన్నకుమార్ స్కూల్ అసిస్టెంట్( లెక్కలు) మరియు సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టు రెండిటికి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఫలితాలలో ఎంపిక కావడం జరిగింది. వివరాలు: తిరుపతి జిల్లా దక్కిలి మండలం అల్తూరుపాడు మాలపల్లికి చెందిన పల్లి. పెంచలయ్య, మునెమ్మ కుమారుడు ప్రసన్న కుమార్( ఎమ్మెస్సీ.బీఈడీ) ది అతిపెద నిరుపేద కుటుంబం. ఇప్పటికి పూరి గుడిసెలో ఉంటూ కాయ కష్టంతో తన తల్లిదండ్రులు చదివించారని తనపై తన తల్లిదండ్రులు ఉంచుకున్న నమ్మకాన్ని నిజం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్ట్ సాధించాలన్న లక్ష్యంతో నిరంతరం ఆలు పెరగకుండా శ్రమిస్తూ సుమారు 10 సంవత్సరాలు ఊరికి దూరంగా అనంతపురం లో ఉంటూ అక్కడే శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. మొదటిసారి డీయస్సీ పరీక్షలు రాశారని ఉపాధ్యాయ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్, సెకండ్ గ్రేడ్ రెండిటికీ ఎంపికీ కావడం చాలా ఆనందంగా ఉందని నా యొక్క ఎంపిక నా యొక్క తల్లిదండ్రులు, గురువుల సహకారం, ప్రొద్బలం తోనే జరిగిందిన్నారు. ఈ సందర్భంగా పిల్లి ప్రసన్నకుమార్ ను గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

# మునీంద్ర బాబు దుర్మరణం: టిటిడి ఉద్యోగి ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి



**స్వర్ణసాగరం ఏర్పేడు:-**

తిరుమల తిరుపతి దేవస్థానములో విద్యుత్తు విభాగంలో విశిష్ట సేవలందిస్తున్న పి. మునీంద్ర బాబు , ఏర్పేడు మండలం, రాజుల కండ్రిక గ్రామ నివాసి, తన విధుల నిర్వహణకు వెళ్తుండగా టిసిఎల్ వద్ద దారుణమైన ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై మరణించారు. మునీంద్ర బాబు తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. దురదృష్టవశాత్తు, ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. మునీంద్ర బాబు తిరుమల తిరుపతి దేవస్థానంలో నిబద్ధతతో విధులు నిర్వర్తించేవారని, ఆయన మరణం తీరని లోటని సహోద్యోగులు, గ్రామస్తులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ విషయమును మృతుని బంధువులు, రాజుల కండ్రిక గ్రామ సర్పంచ్ కడివెళ్ల చెంగల్ రాజు , వాసు తదితరులు స్థానిక పోలీసులకు వెంటనే తెలియజేశారు. ఏర్పేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. శ్రీకాంత్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున సానుభూతి తెలియజేయడంతో పాటు, ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. మునీంద్ర బాబు ఆకస్మిక మరణం ఆయన కుటుంబానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని, ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సాయి నగర్ సమస్యలపై స్పందించండి

## - జిల్లా ఉన్నతాధికారులకుసాయి నగర్ సర్పంచ్ డి.వి రమణ విజ్ఞప్తి





**స్వర్ణసాగరం తిరుపతి రూరల్ :-**

తిరుపతి రూరల్ మండలంలోని సాయి నగర్ గ్రామపంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సాయి నగర్ సర్పంచ్ డివి రమణ సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా పలు సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.మొదటగా జిల్లా జాయింట్ కలెక్టర్ తో సాయి నగర్, లింగేశ్వర్ నగర్ పంచాయితీలో శ్రీ స్వామి హతి రాంజీ మఠం భూముల్లో 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారి ఇండ్ల రెగలైజేషన్ గురించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశం ప్రకారం మరియు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా గత అసెంబ్లీ సమావేశంలో విషయం ప్రస్తావించారని తెలియజేస్తూ వెంటనే సమస్య పరిష్కారము చేయవలసిందిగా కోరారు.జె.సి సూచనల మేరకు తిరుపతి ఆర్.డి.ఓ తో చర్చించారు రేపు తిరుపతి ఆర్.డి.ఓ కార్యాలయంలో జరిగే సమావేశం లో అన్ని వివరాలతో రావాల్సిందిగా తిరుపతి ఆర్.డి.ఓ తెలిపారు. అనగా తేదీ:-2 -9-2025 మంగళవారం 3:00 %ాపీ% గంటలకు ఈ విషయం తదుపరి జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, జిల్లా రిజిస్ట్రార్ ను కలిసి పంచాయతీలకు రావలసిన 15 ఫైనాన్స్ మరియు రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ సర్ ఛార్జ్ నిధులు మంజూరును వెంటనే ఆయా పంచాయతీలకు జమ చేయవలసిందిగా కోరారు, మరో వారం పది రోజుల్లో సదరు నిధులు విడుదల కానున్నాయని డి.పి.ఓ వారు తెలిపారు.అనంతరం జిల్లా పోలీస్ సూపరింటెంట్ కార్యాలయంలో అధికారులను కలిసి రాత్రి గస్తీలను ఏర్పాటు గ్రామంలో శాంతి భద్రత లు కాపాడవలసిందిగా కోరారు.

# వృషభ వాహనము పై మాడవీధులలో విహరించిన గణనాథుడు







**కాణిపాకం, సెప్టెంబర్ 1 స్వర్ణ సాగరం**

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వృషభ వాహనము ఉభయదారులు గా కాణిపాకం సంత పల్లె మారేడుపల్లె ముదిగోళం చిత్తూరు శాలివాహన వంశిస్థులు వహించారు .ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆలయంలో కళ్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారికి శాస్త్రోక్తంగా తేనే, నెయ్యి, పాలు, పెరుగు మరియు సుగంధ ద్రవ్య పరిమళాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం షోడశోపచార పూజలు నిర్వహించారు. స్వామివారిని వృషభ వాహనంపై ఉంచారు. అనంతరం స్వామి వారు మాడవీధుల విహరించుతూ ఉండగా భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు.ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్ మరియు పూతలపట్టు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆలయ అధికారులు, ఉభయ దారులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వజ్రాలాపురం బోయకొండ ఆలయంలో బుసా నాగరాజు గౌడ్ జన్మదిన వేడుకలు





**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.సెప్టెంబర్ 1**

చిత్తూరుజిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు, చిత్తూరు జిల్లా బీసీ ఈడిగ సాధికార సమితి అధ్యక్షులు బుసా నాగరాజు గౌడ్ జన్మదినోత్సవం వేడుకలు పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా తన అభిమానుల ,టిడిపి పార్టీ నాయకుల ,కార్యకర్తల మధ్య చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ సంఘం మరియు చిత్తూరు పార్లమెంటరీ ఈడిగ సాధికార సమితి ఆధ్వర్యంలో ఉత్సాహ పూరితంగా జరిగింది. బుసా నాగరాజా గౌడ్ బోయకొండ గంగమ్మ తల్లిని దర్శించి అనంతరం తన శ్రేయోభిలాషుల మధ్య భారీ కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ చిత్తూరుజిల్లా నందు గల ఈడిగ సామాజిక వర్గ ప్రముఖులు గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిశీలకులు ఎన్ పి. ప్రకాష్ నాయుడు,బంగారుపాళ్యం మండల టిడిపి అధ్యక్షులుఎన్ పి.ధరణి టిడిపి జనరల్ సెక్రటరీ బుస జనార్దన్ గౌడ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.తన జన్మదిన వేడుకకు విచ్చేసిన, ఆశీర్వదించిన, శ్రేయోభిలాషులు, అభిమానులకు అందరికీ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు సమాజసేవ విషయంలో ముందంజలో ఉండే ఈయన ఆ యు ,ఆరోగ్యాలతో పూర్ణ ఆయుష్షుతో ,మరెన్నో ఉన్నతమైన పదవులను అధిరోహిం చాలని, ఆ కలియుగ దైవాన్ని వేడుకున్నారు.ఈకార్యక్రమం లో జిల్లా లోని ఈడిగ గౌడ్ సంఘ నాయకులు అభిమానులు జిల్లా టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# గుడిపాల గ్రామ పంచాయతీ లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**గుడిపాల స్వర్ణసాగరం సెప్టెంబర్ 01**

గుడిపాల మండలంలోని గుడిపాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ తుమ్మల శాంబశివ నాయుడు కుమార్తె లలిత చౌదరి గుడిపాల రేషన్ షాపు డీలర్ తుమ్మల దీప చౌదరి ఆధ్వర్యంలో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి వాగ్దానాలను నెరవేర్చంతో పాటు పేదలకు అందించే నిత్యవసర సరుకుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పండుగ వాతావరణం లో ఈ స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. సుపరి పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పథకాన్ని టెక్నాలజీని అందుపుచ్చుకొని అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని లలిత చౌదరి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది డిజిటల్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, మహిళా పోలీస్ పావని, ఇంజనీర్ అసిస్టెంట్ హర్ష, వెల్ఫేర్ అసిస్టెంట్ స్వాతి,గ్రామ పెద్దలు, మహిళలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తొట్టంబేడు బీడీ కాలనీ సమీపంలో క్వారీకి వ్యతిరేకంగా వినతి,





**స్వర్ణ సాగరం- తొట్టంబేడు,**

తొట్టంబేడు మండలంలోని బీడీ కాలనీ, జగనన్న కాలనీ సమీపంలో మళ్లీ క్వారీ ప్రారంభించే ప్రయత్నాలు జరుగుతు ం డటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మూతబడ్డ సర్వే నంబర్ 157లోని క్వారీని తిరిగి ప్రారంభించేందుకు కొంతమంది వ్యాపారస్తులు మండల రెవెన్యూ కార్యాలయానికి ఎన్వోసీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.ఈ విషయం తెలుసుకున్న కాలనీ నివాసులు తక్షణమే ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ క్వారీకి ఎన్వోసీ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. క్వారీ సమీపంలోనే కాలనీలు ఉండటంతో పాటు గోదాములు, మున్సిపల్ పారిశుద్ధ నీటి కేంద్రం, జలవనూర్ల పిహెచ్ఈ సెంటర్, హై స్కూల్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కొత్త భవనం నిర్మాణంలో ఉన్నాయని వారు గుర్తుచేశారు.ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక ప్రజలు ఎమ్మార్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. క్వారీ మళ్లీ ప్రారంభిస్తే ధూళి, కాలుష్యం కారణంగా కాలనీ ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని వారు తెలిపారు. అదేవిధంగా, పక్కనే ఉన్న తాగునీటి కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు కూడా ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.“మూసివేసిన క్వారీని మళ్లీ ప్రారంభించడం ప్రజలకు శాపమవుతుంది. ప్రజల ఆరోగ్యం, పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని అధికారులు దీనికి ఎన్వోసీ ఇవ్వకూడదు” అని కాలనీ వాసులు స్పష్టం చేశారు.అధికారులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.





# మంచు విష్ణు ఓటీటీకి టైం ఫిక్స్.. ఎప్పటి నుండి స్ట్రీమింగ్ అంటే..!

మంచు విష్ణు ప్రధాన పాత్రలో మైథలాజికల్ నేపథ్యంలో తెరకెక్కిన భారీ చిత్రం 'కన్నప్ప' థియేటర్లలో మంచి విజయాన్ని నమోదు చేసింది. పాన్-ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమాను ఐదు భాషల్లో విడుదల చేశారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో విడుదలైన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. బాలీవుడ్‌కి చెందిన ప్రముఖ దర్శకుడు అయిన ముఖేష్, 'మహాభారతం' సీరీస్‌తో మంచి గుర్తింపు పొందారు. ఇక ఈ చిత్రానికి మోహన్ బాబు నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రంలో గెస్ట్ రోల్స్ లో మోహన్ బాబు, శివబాలాజీ, ప్రభాస్ (రుద్రుడిగా), అక్షయ్ కుమార్ (శివుడిగా), కాజల్ అగర్వాల్ (పార్వతిగా), మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, శరత్ కుమార్, ప్రీతి ముకుందన్,మధుబాల,బ్రహ్మానందం, రఘుబాబు తదితరులు నటించారు. సినిమా అధిక భాగం న్యూజిలాండ్‌లో చిత్రీకరించబడింది. అనేక వాయిదాల తర్వాత చివరకు జూన్ 27న థియేటర్లలో విడుదలైంది. ఓటీటీ రిలీజ్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్న అభిమానులకి గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్. సెప్టెంబర్ 4 నుండి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ మూవీ స్ట్రీమింగ్ కానుంది. కన్నప్ప సినిమా థియేటర్లలో ఓ మోస్తరు విజయం సాధించింది. అయితే ఈ సినిమా ఓటీటీ విడుదలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. సాధారణంగా సినిమా విడుదలై 7-8 వారాల వ్యవధిలో ఓటీటీలోకి వచ్చేస్తుంది. అయితే కన్నప్ప విడుదలై దాదాపు 10 వారాలు గడుస్తున్నా ఓటీటీ రిలీజ్‌పై క్లారిటీ రాలేదు.ఎట్టకేలకి ఈ రోజు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ మూవీని థియేటర్స్‌లో మిస్ అయిన వారు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయవచ్చు. ముఖ్యంగా ప్రభాస్ కోసం ఈ మూవీని ఎక్కువగా చూసే ఛాన్స్ ఉంది.



# నీతో అద్భుతమైన జ్ఞాపకాలు.. ఇక గుడ్ బై

విక్టరీ వెంకటేశ్ ఎమోషనల్ అయ్యాడు. తన పెంపుడు శునకం గూగుల్ చనిపోవడంతో బాధపడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దానితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. ఇక వీడ్కోలు అని రాసుకొచ్చాడు. 'మా ప్రియమైన గూగుల్. గత 12 ఏళ్లుగా మా జీవితాల్లో నువ్వు భాగమయ్యావు. ఎంతో ప్రేమని పంచావు. అందమైన జ్ఞాపకాలని ఇచ్చావు. నువ్వే మా సన్‌షైన్. ఇక నీకు వీడ్కోలు. నువ్వు లేని శూన్యత మాటల్లో వర్ణించలేనిది. నేను నిన్ను ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను డియర్ ఫ్రెండ్' అని వెంకటేశ్ తన ఇన్ స్టాలో పోస్ట్ పెట్టాడు. దీనికి నటి ఖుష్బూ కూడా కామెంట్ చేసింది. ఓం శాంతి అని రాసుకొచ్చింది. వెంకటేశ్ సినిమాల విషయానికొస్తే ఈ ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించాడు. రీసెంట్‌గానే త్రివిక్రమ్‌తో మూవీ చేయబోతున్నట్లు ప్రకటించాడు. ఇది కూడా కుటుంబ కథా చిత్రం అని తెలుస్తోంది. త్వరలో షూటింగ్ మొదలుకానుంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమాని థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నారు.



# ఆర్జీవీతో డ్యాన్స్ చేయించిన జగపతి బాబు



టాలీవుడ్ సీనియర్ హీరో జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న జీ తెలుగు రియాలిటీ టాక్ షో జయమ్ము నిశ్చయమ్మురా శ్రోతలను ఎంతగానో అలరిస్తోంది. ప్రతి వారం ప్రత్యేక అతిథులతో వినోదాన్ని పంచే ఈ షోకు తాజా ఎపిసోడ్ మరింత స్పెషల్‌గా మారింది. ఈ వారం గెస్టులుగా సెన్సేషనల్ డైరెక్టర్లు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ), సందీప్ రెడ్డి వంగా హాజరై షోకు హైలైట్‌గా మారనున్నారు. ఇద్దరూ సినిమాల పరంగా ఎంత విభిన్నమైన శైలిలో ఉన్నా ఒకే స్టేజ్‌పై కలిసినప్పుడు మాత్రం నవ్వులు, సరదా, కాస్త ఫైర్‌తో ప్రేక్షకులని అలరిస్తుంటారు. తాజాగా షోకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, ఇందులో ఇద్దరూ కలిసి చేసిన చిలిపితనం, జోక్స్, బోల్డ్ కామెంట్లు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా సందీప్ వంగా "ఆర్జీవీ నా ఫేవరెట్ డైరెక్టర్" అని కొన్నిసార్లు చెప్పిన నేపథ్యంలో, వీరిద్దరూ కలిసి మాట్లాడిన అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఆర్జీవిని సైతాన్ అని జగపతి బాబు అనడం, డెవిల్-యానిమల్ పక్క పక్కనే ఉంటే ఎంత ముద్దుగో ఉందో అని చెప్పడం ప్రోమోకి హైలైట్‌గా మారాయి.మరోవైపు ప్రోమో మొదట్లో ఆర్జీవి డ్యాన్స్ వేయడం కూడా షోకి హైలైట్. మొత్తానికి ఈ ఎపిసోడ్ మాత్రం ప్రేక్షకులకి ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ మాస్ కాంబినేషన్ ఎపిసోడ్‌ను సెప్టెంబర్ 7, ఆదివారం రాత్రి 9 గంటలకు జీ తెలుగులో ప్రసారం చేయనున్నారు. ప్రోమో చూసినవాళ్లు మాత్రం .. "ఫుల్ ఎపిసోడ్ ఎప్పుడొస్తుందా?" అంటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.